https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సారథ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 273 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ బుధవారం, జూలై,29, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

# పోలీసు కేసులకు భయమా..?




### మాస్కుల వెనుక విద్యార్థుల భవిష్యత్ ఆందోళన
### పోలీసుల ఏఐ ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల భయంతో మాస్కులు ధరిస్తున్న యువత
### ఎఫ్ఐఆర్‌లు నమోదైతే ఉద్యోగాలు, పాస్‌పోర్ట్‌లకు సమస్యలు వస్తాయని ఆందోళన

**న్యూఢిల్లీ,జూలై,28:**
నీట్–యూజీ పేపర్ లీక్ వ్యవహారంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో కొత్త ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసు కేసులకు భయపడి చాలామంది విద్యార్థులు మాస్కులు, కళ్లద్దాలతో తమ గుర్తింపును దాచుకుంటున్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల నిఘానే దీనికి ప్రధాన కారణం. నిరసనలో పాల్గొన్న తమపై ఎఫ్ఐఆర్ నమోదైతే భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, పాస్‌పోర్ట్ జారీ, విదేశీ విద్య అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. "మాడిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతున్నాం. ఇందులో తప్పేముంది? మాకు పోలీసు కేసులంటే భయం లేదు" అని రవి అనే విద్యార్థి ధైర్యంగా చెబుతున్నప్పటికీ, చాలామందిలో ఈ భయం కనిపిస్తోంది. "ఒక తప్పుడు కేసు నమోదైనా, దాని నుంచి బయటపడినా కూడా భవిష్యత్తులో ఉద్యోగ, వీసా దరఖాస్తుల్లో దాన్ని ప్రస్తావించాల్సి వస్తుంది. ఇది కచ్చితంగా ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే విద్యార్థులు భయపడుతున్నారు" అని సుప్రీంకోర్టు న్యాయవాది ఒకరు 'ఇండియా టుడే డిజిటల్'తో చెప్పారు. పాస్‌పోర్ట్ చట్టం ప్రకారం, కోర్టులో క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉంటేనే పాస్‌పోర్ట్ నిరాకరించవచ్చని, కేవలం ఎఫ్ఐఆర్ ఆధారంగా కాదని పలు హైకోర్టులు తీర్పులిచ్చాయి. అయినప్పటికీ, పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. నేరస్థులను గుర్తించేందుకే కెమెరాలు పెట్టామని పోలీసులు చెబుతున్నా, ఇది తమ వ్యక్తిగత స్వేచ్ఛపై దాడి అని విద్యార్థులు, మానవ హక్కుల కార్యకర్తలు వాదిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, నిరసన తెలిపే హక్కుకు, భవిష్యత్తు భద్రతకు మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారు.

# రేవంత్ 'యూత్' మంత్రం..
# బీజేపీకి రేవంత్‌రెడ్డి మాస్టర్ స్ట్రోక్..?

### 'జై జవాన్ - జై కిసాన్'కు 'జై యువ'ను జోడించిన రేవంత్‌రెడ్డి
### దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములుగా గుర్తించే యత్నం
### యువత ఆగ్రహాన్ని, కాంగ్రెస్ వైపు సానుకూలతగా మార్చే వ్యూహాత్మక ఎత్తుగడ
### జాతీయ స్థాయిలో చర్చకు తెరలేపిన తెలంగాణ ముఖ్యమంత్రి



**హైదరాబాద్,జూలై,28:**
"సమస్య వచ్చినప్పుడు స్పందించడం వేరు, ఆ సమస్యనే అవకాశంగా మార్చుకుని రాజకీయ ప్రత్యర్థులను ఇరుకున పెట్టడంవేరు" ఈ సూత్రాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా నీట్ కుంభకోణంపై యువత, విద్యార్థి లోకం అట్టుడుకుతున్న వేళ,ఆయన వేసిన '21ఏళ్లకే పోటీ' అనే ఎత్తుగడ, సాధారణ రాజకీయ ప్రకటనల కంటే చాలా లోతైనది, వ్యూహాత్మకమైనదిగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ఆగ్రహాన్ని ఆయుధంగా...**
దేశంలో దాదాపు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన నీట్ వ్యవహారం.. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను పెంచింది. ఈ ఆగ్రహాన్ని కేవలం నిరసనలకే పరిమితం చేయకుండా,దానికి ఒక రాజకీయ రూపాన్ని ఇవ్వడంలో రేవంత్ ముందడుగు వేశారు. "మీరు కేవలం బాధితులు కాదు, రేపటి శాసనకర్తలు కావాలి. మీ సమస్యలను మీరే చట్టసభల్లోకి వచ్చి పరిష్కరించుకోవాలి" అని పరోక్షంగా పిలుపునివ్వడమే ఈ ప్రతిపాద నలోని అసలు మర్మం. ఇది యువతలోని నిస్సహాయతను పారదోలి, వారిలో ఆశను, అధికారంపై ఆకాంక్షను రేకెత్తించే ప్రయత్నం.

**'జై యువ'.. పాత నినాదానికి కొత్త పదును**
లాల్‌బహదూర్ శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్–జై కిసాన్' నినాదం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. దానికి 'జైయువ'ను జోడించడం ద్వారా రేవంత్ మూడు కీలక సంకేతాలు పంపారు. గుర్తింపు: సైనికులు, రైతులంత ప్రాధాన్యం యువతకు ఇస్తున్నామని చెప్పడం. ఆధునికీకరణ: కాంగ్రెస్ పార్టీ పాత చింతకాయ పచ్చడి కాదని, ఆధునిక తరమైన 'జెన్–జీ' ఆకాంక్షలను అర్థం చేసుకోగలదని చాటడం.ప్రత్యామ్నాయం: బీజేపీ తరచూ వాడే 'యువశక్తి' అనే నినాదానికి పోటీగా, మరింత ఆచరణాత్మకమైన, అధికార భాగస్వా మ్యాన్ని వాగ్దానం చేసే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.

**జాతీయ వేదికపై రేవంత్**
ఈ డిమాండ్ కేవలం తెలంగాణకు పరిమితమైనది కాదు. దీనికోసం రాజ్యాంగ సవరణ చేయాలి, ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధానికి పంపుతామనడం ద్వారా రేవంత్ తన పోరాటాన్ని ఢిల్లీకిమారుస్తున్నారు. తద్వారా, రాహుల్ గాంధీ తర్వాత, బీజేపీకి వ్యతిరేకంగా యువత తరపున బలంగా గళం విప్పుతున్న జాతీయ స్థాయి కాంగ్రెస్ నేతగా తనను తాను ప్రొజెక్ట్ చేసుకుంటున్నారు. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను, రాజకీయ బరువును పెంచే ఒక మాస్టర్ స్ట్రోక్. 21 ఏళ్లకే ఓటు హక్కు ఉన్నప్పుడు, అదే వయసుకు పోటీ చేసే అర్హత ఎందుకు ఉండకూడదనేది తార్కికంగా బలమైన వాదన. ఈ డిమాండ్ నెరవేరినా, నెరవేరకపోయినా కాంగ్రెస్‌కు రాజకీయంగా లాభమే. కేంద్రం ఒప్పుకుంటే, అది కాంగ్రెస్ సాధించిన నైతిక విజయంగా, యువతకు తామిచ్చిన కానుకగా చెప్పుకోవచ్చు. ఒప్పుకోకపోతే,బీజేపీని 'యువత వ్యతిరేకి'గా చిత్రించి, రాబోయే ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వాడుకోవచ్చు. మొత్తం మీద, రేవంత్ రెడ్డి ప్రకటనను కేవలం నీట్ బాధితులపై జాలిగా చూడలేం.

# భోపాల్ లో 24 గంటల్లో 10 మంది మిస్సింగ్..!

### అదృశ్యమైన వారిలో ఇద్దరు మైనర్లు..?
### కోలార్, అయోధ్యా నగర్‌లో ఎక్కువ కేసులు
### సీసీటీవీ, మొబైల్ డేటా పరిశీలన
### రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లలో గాలింపు
### సమాచారం ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి...




భోపాల్,జూలై,28:
మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో 24 గంటల వ్యవధిలో 10 మంది అదృశ్యం కావడం ఆందోళన కలిగిస్తోంది. వీరిలో ఇద్దరు మైనర్లు కూడా ఉన్నారు. నగరంలోని పలు పోలీస్ స్టేషన్ పరిధుల్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదులు చేయడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కొందరి మొబైల్ ఫోన్లు ఇంటి నుంచి వెళ్లిన కాసేపటికే స్విచ్ ఆఫ్ కావడంతో వారి ఆచూకీ కనిపెట్టడం కష్టంగా మారింది.
కోలార్, అయోధ్యా నగర్ పోలీస్ స్టేషన్ పరిధుల్లో అత్యధికంగా మూడు చొప్పున మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. అశోక్ గార్డెన్, టీటీ నగర్, రతీబాద్, అవధ్‌పురి పోలీస్ స్టేషన్ పరిధుల్లోనూ కేసులు నమోదయ్యాయి. అశోక్ గార్డెన్‌లో 17 ఏళ్ల విద్యార్థిని ట్యూషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు స్వయంగా వెతికినా సమాచారం లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.
అయోధ్యా నగర్ పరిధిలో 19 ఏళ్ల గరిమా, 24ఏళ్ల తను, 22 ఏళ్ల మనీశ్ అదృశ్యమైనట్లు ఫిర్యాదులు అందాయి. కోలార్ పరిధిలో 20 ఏళ్ల శివకాంత్, 40 ఏళ్ల అమర్‌జీత్, 45 ఏళ్ల తులసీరామ్ కనిపించకుండా పోయారు. టీటీ నగర్‌కు చెందిన ముస్కాన్, రతీబాద్‌కు చెందిన 30 ఏళ్ల అన్మోల్ సోనీ, అవధ్‌పురి పరిధిలోని 16 ఏళ్ల బాలిక అదృశ్యమైన వారి జాబితాలో ఉన్నారు. ప్రతి మిస్సింగ్ కేసును అత్యంత ప్రాధాన్యంతో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులను ప్రశ్నించడంతో పాటు సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నారు.
రైల్వే స్టేషన్లు,బస్ స్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో గాలింపు కొనసాగుతోంది.మొబైల్ ఫోన్‌లొకేషన్లు, కాల్ వివరాలను సైబర్ బృందం విశ్లేషిస్తోందని అదనపు పోలీస్ కమిషనర్ శైలేంద్ర సింగ్ చౌహాన్ వెల్లడించారు. అదృశ్యమైన వారి గురించి సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నీరవ్ మోదీ లండన్‌లోనే ఉండటం కలచి వేస్తోంది



### నీరవ్ మోదీ అప్పగింత ఆలస్యంపై బ్రిటన్ మాజీ హోం కార్యదర్శి ప్రీతి పటేల్ సంచలన వ్యాఖ్యలు..!
### నీరవ్ మోదీ ఇప్పటికీ లండన్ లోనే ఉండటం తనను కలచి వేస్తోందన్న ప్రీతి పటేల్..
### మన వ్యవస్థ సరిగ్గా పనిచేసి ఉంటే ఆయన ఇండియాలో ఉండేవారని వ్యాఖ్య..!

**న్యూఢిల్లీ,జూలై,28:**
పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ. 14,000 కోట్ల భారీ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించడంలో జరుగుతున్న ఆలస్యంపై బ్రిటన్ మాజీ హోం కార్యదర్శి ప్రీతి పటేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బ్రిటన్ న్యాయవ్యవస్థలో ప్రక్రియలు, సాకులు చూపుతూ అప్పగింతను అడ్డుకోవడం వల్ల భారత ప్రభుత్వం బ్రిటన్‌తో కలిసి పనిచేయాలనే ఉత్సాహాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. 2021 ఏప్రిల్‌లో బ్రిటన్‌హోం కార్యదర్శిగా ఉన్న సమయంలో ప్రీతి పటేల్ నీరవ్ మోదీ అప్పగింత ఉత్తర్వులపై సంతకం చేశారు. అయితే,బ్రిటన్‌లో ఉన్న చట్టపరమైన లొసుగులు, సుదీర్ఘమైన అప్పీళ్ల ప్రక్రియ వల్ల ఆయన ఇప్పటికీ లండన్ జైలులోనే ఉండటంపై ఆమె ఒక పాడ్‌కాస్ట్ సంభాషణలో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆయన (నీరవ్ మోదీ) ఇప్పటికీఈ దేశంలోనే ఉండటం నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. మన వ్యవస్థ బాధ్యతాయుతంగా, సక్రమంగా పనిచేసి ఉంటే ఆయన ఎప్పుడో భారత్‌లో ఉండేవారు" అని ప్రీతి పటేల్ వ్యాఖ్యానించారు.
నీరవ్ మోదీని అప్పగించడంలో బ్రిటన్ విఫలం కావడంపై భారత అధికారులు తీవ్ర ఆగ్రహంతో, నిరాశతో ఉన్నారని ఆమె తెలిపారు. బ్రిటన్ న్యాయ వ్యవస్థలోని అప్పీళ్ల ప్రక్రియలను నీరవ్ మోదీ దుర్వినియోగం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. లండన్‌లోని వ్యాండ్స్‌వర్త్ జైలులోఉన్న నీరవ్‌మోదీ అప్పగింతను అడ్డుకోవడానికి వరుసగా అప్పీళు చేసుకుంటూ రాగా, బ్రిటన్ మాజీ మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# ప్రధాన్ శాఖ మార్పు ప్రతిపాదన..!
# సీజేపీ తిరస్కరించినట్లు సమాచారం..!?




### రాజీనామాపైనే సీజేపీ పట్టు
### రాహుల్ గాంధీ కూడా అదే డిమాండ్

**న్యూఢిల్లీ,జూలై,28:**
విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం తొలుత ఆయన శాఖను మాత్రమే మార్చుతామని ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే దానికి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తిరస్కరించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచే తప్పించాలని సీజేపీ స్పష్టంచేసినట్లు తెలిసింది. సమాచారం ప్రకారం.. జులై 20న కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సీజేపీ ప్రతిని ధులు సౌరవ్ దాస్,ఆశుతోష్ రాంకాతో సమావేశమయ్యారు. ఆ సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌ను విద్యాశాఖ నుంచి మరో శాఖకు మార్చే ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. అయితే కేవలం శాఖ మార్పుతో తమ ఆందోళన విరమించబోమని, ఆయన పూర్తిగామంత్రి పదవికి రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేసినట్లు సమాచారం. మంత్రి పదవుల కేటాయింపు, మార్పులు ప్రధానమంత్రి పరిధిలోని అంశమని కేంద్ర మంత్రులు చెప్పినట్లు తెలుస్తోంది. ఒకవేళ రాజీనామా కాకుండా మరోప్రతిపాదనకు అంగీ కరిస్తేఆందోళనకారుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుందని సీజేపీ భావించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ప్రస్తావించారు.

# జూరాలకు పోటెత్తుతున్న కృష్ణమ్మ..

### శ్రీశైలం డ్యామ్ కు పెరుగుతున్న వరద ప్రవాహం - కృష్ణానది ఎగువన కురుస్తున్న కుండపోత వర్షాలు - జూరాల ప్రాజెక్టుకు 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో - క్రస్ట్ గేట్లు ఎత్తేసిన అధికారులు..
### శ్రీశైలం జలాశయానికి వరద...



**శ్రీశైలం,జూలై,28:**
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎల్ నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ కృష్ణానది మాత్రం జలకళను సంతరించుకుంటోంది. కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడుతుండటంతో జూరాలకు ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా... అధికారులు క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దాదాపు 30,700 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి ప్రవాహం నిలకడగా కొనసాగుతుండటంతో దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమలతో పాటు భీమా నది పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భీమా నది ప్రవాహాలు కూడా తోడైతే జూరాలకు ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది.ఎగువ నుంచి వచ్చే ప్రవాహం భారీగా పెరిగే సూచనలు కనిపించడంతో, రాబోయే రోజుల్లో శ్రీశైలానికి మరింత జలకళ రానుందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# మేం ఎవరికి ఏం అమ్మాలో ఎవరూ చెప్పనక్కర్లేదు

### టర్కీకి ఎఫ్-35 విమానాల విక్రయంపై నెతన్యాహుకు ట్రంప్ షాక్
### టర్కీ తమకు నమ్మకమైన భాగస్వామి అన్న ట్రంప్



**న్యూఢిల్లీ,జూలై,28:**
టర్కీకి ఎఫ్–35 ఫైటర్ జెట్లను విక్రయించడంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యక్తం చేసిన అభ్యంతరాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా తోసిపుచ్చారు. తాము ఎవరికి ఏ ఆయుధాలు అమ్మాలో ఎవరూ తమకు చెప్పాల్సిన అవసరం లేదని ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ ప్రధానితో భేటీకి ముందు రోజు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. టర్కీ ప్రెసిడెంట్ రెజెప్ తయ్యిప్ ఎర్డోగాన్‌ను తన మంచి మిత్రుడిగా అభివర్ణించిన ట్రంప్... టర్కీ తమకు అత్యంత విలువైన, నమ్మకమైన భాగస్వామి అని కొనియాడారు. అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, టర్కీ తీవ్రవాద భావజాలంతో కూడిన పాలనలో ఉందని, అలాంటి దేశానికి ఎఫ్–35 యుద్ధ విమానాలను విక్రయిస్తే పశ్చిమాసియాలో సైనిక సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## అకాడమిక్ ఫ్రేమ్‌వర్క్‌ను

# తప్పనిసరిగా పాటించాలి...

### విద్యార్థులతో నిరంతర సాధన నిర్వహిస్తేనే మెరుగైన ఫలితాలు...ఉపాధ్యాయులు ముందస్తుగా సన్నద్ధమై వస్తేనే ఉత్తమ బోధన:జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

జనగామ జులై 28 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి పసునూరి దేవేందర్:విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ముందుగా ఉపాధ్యాయులు ప్రతి పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ముందస్తుగా సన్నద్ధమై తరగతి గదిలోకి రావాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సూచించారు. ఉపాధ్యాయులు ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో బోధిస్తేనే విద్యార్థుల్లో నేర్చుకునే సామర్థ్యం పెరిగి, ఉత్తమ ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు.మంగళవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల పరిధిలో గల జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ముందుగా 8వ,10వ తరగతి గదులను సందర్శించి, ఉపాధ్యాయుల బోధన విధానాన్ని, విద్యార్థుల అభ్యాసన స్థాయిని పరిశీలించారు.విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి అవగాహనను పరీక్షించడంతో పాటు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.అనంతరం సాంఘీక శాస్త్రం పాఠ్యాంశంలోని ఆర్కిటిక్, అంటార్కిటిక్ వలయాల గురించి విద్యార్థులకు సులభమైన శైలిలో వివరించారు.క్లిష్టమైన అంశాలను కూడా సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాల్సిన అవసరాన్ని ఉపాధ్యాయులకు సూచించారు.పాఠ్యాంశాలను కేవలం చదివించడం కాకుండా, విద్యార్థులతో పదేపదే సాధన చేయించడం ద్వారా వారి సామర్థ్యాలను పెంపొందించాలని తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అకాడమిక్ ఫ్రేమ్ వర్క్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.ప్రతి పాఠాన్ని ప్రణాళికాబద్ధంగా బోధిస్తూ నిరంతర మూల్యాంకనం నిర్వహించాలని, విద్యార్థులు నేర్చుకునే సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బోధన సాగించాలని సూచించారు.ప్రతి ఉపాధ్యాయుడు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధమై తరగతి గదిలోకి వస్తే బోధన నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుందన్నారు.పాఠశాల ఆవరణను పరిశీలించిన



కలెక్టర్ అక్కడ పడి ఉన్న చెట్లు,ఉపయోగం లేని ఇనుప సామగ్రిని గమనించి,వాటిని వెంటనే వేలం (ఆక్షన్) ద్వారా తొలగించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా, సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.తదనంతరం పాఠశాలలోని వివిధ తరగతి గదులు, మౌలిక వసతులు, పరిశుభ్రత, పాఠశాల ఆవరణను పరిశీలించి, అవసరమైన మెరుగుదలలపై అధికారులకు పలు సూచనలు చేశారు.విద్యార్థులకు ఉత్తమ విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రతి అంశంపై ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సింగారంలో జలసిరిపై గ్రామసభ

### -సర్పంచ్ కె.నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభ...-భూగర్భ జల పెంపుదలపై ప్రజలకు అవగాహన కల్పించిన అధికారులు...-సర్ ప్రక్రియ100% పూర్తయినందుకు బీఎల్ఓ లకు సత్కారం...





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండలం సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జల సిరిపై మంగళవారం ప్రత్యేక గ్రామసభ జరిగింది.ఆ గ్రామ సర్పంచ్ కె.నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసభలో జల సిరిపై గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.గ్రామంలో నూతనంగా నిర్మించే ఇళ్లతో పాటు అవసరం ఉన్నవారు తమ ఇళ్ల దగ్గర తప్పనిసరిగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు.ఈసారి సరైన వర్షాలు పడలేదని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జలసిరిపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించినట్లు వారు తెలిపారు.వర్షం నీరు నిల్వకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని,అలాగే బోర్ల దగ్గర నీరు రీఛార్జి చేసుకోవాలని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల దగ్గర ఇంకుడు గుంతలు తప్పనిసరి అని పేర్కొన్నారు. డ్రైనేజీ చివరి పాయింట్ దగ్గర ఇంకుడు గుంతల నిర్మించాలని తెలిపారు. భూగర్భ జలాల పెంపుదలకు ప్రతి ఒక్కరు భాగ్యసాములు కావాలని ఆ గ్రామ సర్పంచ్ కె.నాగిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.భూగర్భ జలాల పెంపుదలకు తీసుకోవాల్సిన అంశాలపై పలు విషయాలనుగ్రామ ప్రజలకు వివరించారు.సమావేశం ప్రారంభంలో ఆ గ్రామ మూడోవ వార్డు సభ్యులు భాను మాట్లాడుతూ ఈ గ్రామ సభలో ఇతర శాఖ అధికారులు ఎవరూ లేరని, కేవలం పాలకవర్గం సభ్యులు మాట్లాడుకుంటే ఎలా అని ప్రశ్నించారు.కనీసం గ్రామ స్థాయిలో ఉన్న అధికారులైన ఈ గ్రామ సభలో పాల్గొనవలసి ఉండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శి కొన్ని శాఖల అధికారులకు ఫోన్ చేసి గ్రామసభ జరుగుతుందని మీరు రావలసిందిగా తెలిపారు.ఆ తర్వాతనే ఆ గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాత్రమే హాజరయ్యారు. అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ప్రక్రియ 100% పూర్తయిందని జిపిఓ విజయ్ తెలిపారు.ఈ సందర్భంగా బిఎల్వోలను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో గ్రామ ఉపసర్పంచ్ లక్ష్మప్ప,వార్డు సభ్యులు,జిపిఓ విజయ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన...

# కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన

బెల్లంపల్లి(డీకే చాటింపు ) పట్టణంలోని కాంటా చౌరస్తా ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మంగళవారం కాంట చౌరస్తా లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు అమలుకాని మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం వినోద్ నేటికీ సుమారు 31 నెలలు గడిచినప్పటికీ బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని తెలిపారు.గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు 100 కోట్ల రూపాయల నిధులను ప్రొసీడింగ్లను మార్చి వాటితోనే అరకొర పనులు చేశారు తప్ప కొత్తగా చేసిందేమీ లేదని తెలిపారు. వారు చేసింది కేవలం నియోజకవర్గంలో మండలానికొక సామంత ఎమ్మెల్యేను పెట్టుకుని ప్రభుత్వ భూములను ఎక్కడికక్కడ కబ్జాలు మాత్రం రోజూ చేస్తున్నారని, ఇటీవల గత ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన భూములను కూడా కబ్జా చేశారని తెలిపారు. అంతేకాకుండా అన్ని పనుల్లో కమీషన్లు తీసుకోవడమే కాకుండా నియోజకవర్గ ప్రజలను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. బెల్లంపల్లి పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా రహదారులు ఎక్కడికక్కడ గుంతలు పడి తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న, గత ప్రభుత్వంలో సుమారు 350 ఎకరాల్లో ఏర్పాటు చేయదలచిన ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ నేటికీ ప్రారంభం అవకున్నా, బెల్లంపల్లి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో తగినంత వైద్యులు, సిబ్బంది లేక నియోజకవర్గ ప్రజలు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా, బెల్లంపల్లి పట్టణంలో మిగిలిన సింగరేణి ఇండ్లకు శాశ్వత ఇండ్ల పట్టాలు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు గోసపడుతున్నా, ఇలా చెప్పుకుంటూపోతే బెల్లంపల్లి నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి హైదరాబాద్ లో, విదేశాల్లో జల్సాలు చేస్తున్న గడ్డం వినోద్ ఇప్పటికైనా కళ్ళు తెరిచి బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్నకాలంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడిస్తామని, అప్పటికీ మార్పు రాకుంటే నియోజకవర్గ ప్రజల కోసం నిరాహారదీక్ష కూడాచేస్తామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమం లో పార్టీ నియోజకవర్గ, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెంపుదలకు

# భాగస్వాములు కావాలి

### -బోయిన్ పల్లి తాండ జలసిరిగ్రామ సభలో సర్పంచ్ లక్ష్మణ్ నాయక్...-

### జల సిరి కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన...



నారాయణపేట,(డీకే చాటింపు): భూగర్భ జలాల పెంపుదలకు గ్రామస్తులందరూ భాగస్వాములు కావాలని నారాయణపేట మండలం బోయిన్ పల్లి తండా సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ ఆ గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. నారాయణపేట మండలం బోయిన్ పల్లి తండా గ్రామ పంచాయతీలో మంగళవారం జల సిరి గ్రామ సభ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా విబిజి రాంజీ పథకం కింద గ్రామంలో ఇంకుడు గుంతలు, ఊటకుంటలు,బోర్ రీఛార్జ్ గుంతల నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి ఇంకించి, భూగర్భ జలమట్టాన్ని పెంచడం,నీటి నిల్వలను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సర్పంచ్ వివరించారు.ప్రతి గ్రామస్థుడు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్ నాయక్,వార్డు సభ్యురాలు గంసు బాయి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు ఎమ్మార్పై మల్లేష్,టీ.ఏ.లక్ష్మీనారాయణ,జి.వి.ఓ.జ్యోతి,అంగన్‌వాడీ టీచర్ కౌసల్య,ఆశా వర్కర్ విజయలక్ష్మి,ఎఫ్.ఏ.వెంకటేష్,బుక్ కీపర్ శంకర్,దేవమ్మ, గ్రామ పెద్దలు కిస్త్యా నాయక్, మొత్యా నాయక్,పిత్యా నాయక్,తోల్చ్యా నాయక్, గోబ్ర్యా నాయక్,హేమ్లా నాయక్,కృష్ణ నాయక్, యువకులు లక్ష్మణ్,కాంత్, చందర్,గోపాల్,మహిళలు సీతమ్మ,భామనమ్మ, పరీబాయి,జగనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేయాలి.. కలెక్టర్

కె.వేణుగౌడ్ డీకే.చాటింపు హనుమకొండ:వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నష్టాలను తగ్గించుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి రైతులకు సూచించారు.వ్యవసాయ శాఖ నిర్వహించిన రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి రైతులు, వ్యవసాయ అధికారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ వ్యవసాయ విజ్ఞానాన్ని చేరవేయడంలో రైతు నేస్తం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని, ఆధునిక సాంకేతికత,నీటి లభ్యత యాజమాన్య పద్ధతులను అనుసరించాలని సూచించారు. రైతు భరోసా, రైతు బీమా పథకాలతో పాటు ఎరువుల సకాల సరఫరా కోసం ఫెర్టిలైజర్స్ బుకింగ్ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. 100వ ఎపిసోడ్ సందర్భంగా నిరంతరం కార్యక్రమానికి హాజరైన ప్రగతిశీల రైతులను ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తక్కువ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులు పెసర, కందులు, నువ్వులు, మినుములు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతు వేదికల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వాతావరణ శాఖ నిపుణులు రైతులకు నేరుగా సలహాలు అందిస్తున్నారని తెలిపారు.



జిల్లాలో ఇంకా సాగు చేయని భూములను ఖాళీగా ఉంచకుండా తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి పంటల సాగు రైతులకు ఆదాయాన్ని అందించడంతో పాటు భూసారాన్ని కూడా మెరుగుపరుస్తుందన్నారు. రైతులకు అనువైన పంటల వివరాలను రైతు వేదికల వద్ద ప్రదర్శనల ద్వారా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.రైతు నేస్తం 100వ ఎపిసోడ్ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రగతిశీల రైతులను ఘనంగా సన్మానించి, రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సర్పంచ్ లావణ్య, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో

# సర్ కార్యక్రమంర్వహించడం జరిగింది

### డాక్టర్స్ కాలనీ డివిజన్ సర్ ఇంచార్జ్ నవారు మల్లారెడ్డి

మహేశ్వరం, జూలై 27 (డీకే చాటింపు) అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని డాక్టర్స్ కాలనీ డివిజన్ సర్ ఇంచార్జ్ లిశ్రీనవారు మల్లారెడ్డి, డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ కోరారు. మహేశ్వరం నియోజకవర్గం డాక్టర్స్ కాలనీ డివిజన్ పరిధిలో డివిజన్ అధ్యక్షులు సర్ ఓటర్ సవరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగాడాక్టర్స్ కాలనీ డివిజన్ సర్ ఇంచార్జ్ నవారు మల్లారెడ్డి మాట్లాడుతూ బి ఎల్ ఏ నాయకులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటర్ల నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని కోరారు. డివిజన్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్స్ కాలనీ డివిజన్లో జరుగుతున్న 'సార్' ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, విజయవంతం చేస్తున్న బూత్ లెవెల్ ఏజెంట్లు ( బి ఎల్ ఎ ), బి.ఎల్.ఓ , కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ డివిజన్ అధ్యక్షులు నల్లంకి ధనరాజ్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు



## ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలు అందజేసిన

# చిలుక మధుర ఉపేందర్ రెడ్డి



మహేశ్వరం,జూలై 28 (డీకే చాటింపు) ఉమ్మడి ఆర్కేపురం డివిజన్ పరిధిలో ప్రత్యేకసమగ్ర సంరక్షణపునశ్చరణ (స్పెషల్ఇంటెన్సివ్ రెవిషన్).సర్‌లి కార్యక్రమంలో భాగంగా బిఎల్ఓ సుమలత,మమత,రాంబాబు, స్వప్న, అనిత,లలిత,శకుంతుల, పుష్పలత, అర్చన, నందిని, పరమేశ్వరి, ఉదాయ, సుమలత సూపర్వైజర్ సైదులు ఆధ్వర్యంలో ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను ఓటర్లకు అందజేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు లిచిలుక మధుర ఉపేందర్ రెడ్డి

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
బుధవారం, జూలై,29, 2026

## స్వశక్తితో శత్రుదేశాలకు చెక్

ఆపరేషన్ సిందూర్ తర్వాత స్వశక్తి పెంచుకోవడంపై భారత్ దృష్టి పెట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా సైన్యానికి అవసరమైన అత్యాధునిక ఆయుధాలను తయారు చేస్తోంది. ఇటీవల కేంద్రం బడ్జెట్‌ను కూడా లక్ష కోట్లు అదనంగా కేటాయించింది. మరోవైపు అత్యవసర పరిస్థితిలో విమానాలు ఎక్కడైనా దిగేందుకు వీలుగా జాతీయ రహదారులను నిర్మిస్తోంది. నరేంద్రమోదీ స్టైలే వేరు.. ఎవడికి ఎక్కడ చెక్ పెట్టాలో.. ఎవరిని ఎలా అణచివేయాలో ఆయనకు తెలిసినంత ఎవరికీ తెలియదు. దేశం కోసం ఆయన ఏమైనా చేస్తారు. దేశం ఫస్ట్ నినాదాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తారు. తనను ద్వేషించినా, ధూషించినా పట్టించుకోరు. సంపాదించాలనే యావ లేని వ్యక్తి. గతంలో చైనాకు లొంగిపోయాడని కాంగ్రెస్ మోదీపై ఆరోపణలు చేసింది. ఇక అంబానీ అదానీకి దోచి పెడుతున్నాడని ఆరోపిస్తోంది. గతంలో రఫేల్ కొనుగోలుపైనా రాద్ధాంతం చేసింది కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అంటే 2014కు ముందు ఈశాన్యరాష్ట్రం ఉగ్రవాదం, వేర్పాటువాదం, సదుపాయాల లేమి. అభివృద్ధి రాహిత్యం వంటి సమస్యలు ఉండేవి. ఇక వేర్పాటు వాదం బలంగా ఉండేది. బోడోలాండ్, మణిపూర్‌లో ఉగ్రవాద సంస్థలు పనిచేయడం జరిగేది. మోదీ వచ్చాక ఆయన దేశ సరిహద్దును ఒక వంతెనగా మార్చారు. ఆగ్నేయాసియా దేశాలకు రాకపోకలు సాగించడానికి, సంబంధాలు మెరుగుపరచడం, ఇచ్చిపుచ్చుకోవడానికి ఈశాన్య భారత్‌ను బ్రిడ్జిగా చూశారు. ఇదే సమయంలో ఈశాన్య రాష్ట్రాల్ల అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్లు, రైలు మార్గాలు నిర్మించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న వేర్పాటు వాదం తొలిపోయేలా చేశారు. ఇక మన దేశంలో మనపైనే బాంబులు కురిపించిన ప్రాంతం..సియాచెన్? కశ్మీర్‌కు 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న ద్వీపం. గతంలో దీనిపై చైనా ఆధిపత్యం చెలాయించింది. బెదిరిస్తూ.. వాడుకుంది. మోజాంబిక్ ఛానల్‌కు కీలకమైన సియాచెల్స్‌లో ఇప్పుడు మోదీ చక్రం తిప్పబోతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సియాచెన్‌కు 175 మిలియన్ డాలర్ల ఆర్థికసాయం ప్రకటించారు. అక్కడ నావీ బేస్ ఏర్పాటు చేయబోతున్నారు.భారత్ ఆర్థికసాయంతో గృహ నిర్మాణం, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ఉన్నాయి. మోజాంబిక్ ఛానెల్ వైపు చైనా షిప్పింగ్ రాకపోకలను గమనించేలా భారత నేవీ బేస్ ఏర్పాటు అవుతుంది. గతంలో చైనా బెదిరింపులు విఫలమైన నేపథ్యంలో ఈ అడుగు వ్యూహాత్మకం.చైనా భారత చుట్టూ నౌకల మోహర్ వేస్తుంటే, సియాచెన్ బేస్ దాని ఆధిపత్యాన్ని ఎదుర్కొంటుంది. ఇది హిందూ మహాసముద్రంలో భారత పత్రిక స్థిరపడుతుందన్న సంకేతం. మోదీ దీర్ఘకాలిక దృష్టితో ఆర్థిక సహాయం ద్వారా మిత్రత్వాలు పెంచుకుంటూ, రక్షణ ప్రాంగణాన్ని బలోపేతం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇండో?పసిఫిక్ ప్రాంతంలో భారత ఆధిపత్యం పెరుగుతుందిమూడేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన రహదారులపై విమానాల ల్యాండింగ్ విజయవంతంగా నిర్వహించింది. తాజాగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అస్సాం మోరాన్‌లో ఎన్‌హెచ్ ?127పై యుద్ధ విమానాల ల్యాండింగ్ ట్రయల్స్ విజయవంతం చేసింది. ఈశాన్య భారతదేశంలో మొదటి ఈఎల్ఎఫ్‌గా, సుఖోయ్, రాఫెల్ వంటి యుద్ధ విమానాలు ఇక్కడనిలిచే సామర్థ్యం ప్రదర్శించాయి. ఇది దేశ రక్షణ వ్యవస్థ కు కీలకం.యుద్ధ సమయంలో ఎయిర్‌స్ట్రిప్‌లు దెబ్బతిన్నప్పుడు హైవేలను రన్‌వేలుగా దిగడానికి వీలుగా నిర్మించారు. అస్సాం 4.2 కి.మీ. భాగం 4?లేన్ రూపంలో నిర్మించారు. ప్రభుత్వ భవనాలు, సైనిక కార్యకలాపాలకు ఉపయోగపడుతుంది. ప్రధాని మోదీ నేరుగా హైవేపై ల్యాండ్ చేసి ప్రారంభించను న్నారు. ఈశాన్య రాజకీయ, వ్యూహాత్మక కేంద్రం. చైనా, మయన్మార్ సరిహద్దుల సమీపంలో ఈ ఈఎల్ఎఫ్ యుద్ధ సామర్థ్యాన్ని పెంచుతుంది.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారథ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి:
సెల్ : 9603754136 - 7386287837

# సింగారం బీపీఎం(బ్రాంచి పోస్ట్ మాస్టర్)పై ఫిర్యాదుల హోరు..!

**-గ్రామసభలో బీపీఎం పనితీరుపై ఫిర్యాదుల పరంపర...!! -విధి నిర్వహణను సక్రంగా నిర్వహించాలి... -బీపీఎంకు సర్పంచ్ సూచన... -విధి నిర్వహణలో బీపీఎం -నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులకు ఫిర్యాదు చేయండి... -సింగారం ప్రజలకు సర్పంచ్... -నారాయణపేట మండలం సింగారం బీపీఎం పనితీరుపై సర్వత్ర ఫిర్యాదులు...**





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండలం సింగారం బీపీఎం(బ్రాంచి పోస్ట్ మాస్టర్)పై ఆ గ్రామానికి చెందిన పలువురు ప్రజలు పలు విషయాలపై ఫిర్యాదు చేశారు.సింగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరిగిన జలసిరి గ్రామసభలో ఈ ఫిర్యాదుల పరంపర కొనసాగింది.సింగారం బీపీఎం నిబంధనల పేరిట పింఛన్దారులను వేధిస్తున్నారని..సక్రంగా పింఛన్లు పంపిణీ చేయడం లేదని..ఆయన నుంచి తాము అనవసర మాటలు పడవలసి వస్తుందని.. పింఛన్ల కోసం తెల్లవారుజామున నుంచి ఆయన ఇంటి గోడపై పాస్ బుక్కులు పెడుతున్నట్లు.. పొదుపు ఖాతాల పుస్తకాలను తిరిగి ఇవ్వకుం డగా తమ దగ్గరే ఉంచుకుంటున్నారని తదితర అంశాలపై పలువురు ఫిర్యాదు చేశారు. 8వ,వార్డు సభ్యులు వినోద్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చేసిన కూలి పనులకు సంబంధించిన డబ్బుల చెల్లింపులో తప్పనిసరిగా మేటి,ఫీల్డ్ అసిస్టెంట్ సంతకాలు అడుగుతు న్నారని,ఇది ఏ ఊర్లో లేదని,ఇక్కడ ఎందుకు నిబంధన పెట్టారని ప్రశ్నిం చారు.ఇదే విషయంపై ఇటీవల నారాయణపేట బ్రాంచి పోస్ట్ మాస్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గ్రామ బీపీఎం పించన్దారులను,ఉపాధి హామీ కూలీలను పలు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే విషయాన్ని తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.మేటి,ఫీల్డ్ అసిస్టెంట్ తదితర అధికారుల ధ్రువీకరణ తర్వాతనే ఉపాధి హామీ కూలీలకు డబ్బులు చెల్లింపు జరుగుతుందని,ఈ చెల్లింపు సమయంలో తిరిగి ఉపాధి హామీ మేటి,ఫీల్డ్ అసిస్టెంట్ సంతకాలు అవసరం లేదని ఉన్నత అధికారులు స్పష్టం చేసినట్లు వార్డు సభ్యులు వినోద్ పేర్కొన్నారు.అక్కడే ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ కాంత రాజ్ మాట్లాడుతూ తమ సంతకాలు లేకుండా బీపీఎం కూలీ డబ్బులు చెల్లించవచ్చునని..కానీ సింగారం బీపీఎం ఈ నిబంధన విధించడంపై ఆయన ఆక్షేపించారు.ఇతర గ్రామాల్లో లేని నిబంధన సింగారం పోస్ట్ ఆఫీస్ లో ఎందుకు అమలు చేస్తున్నారని గ్రామ సర్పంచ్ తో పాటు పలువురు ప్రశ్నించారు.తాం ప్రతినెల పోస్ట్ ఆఫీస్ లో పొదుపు చేస్తున్నామ ని..అందుకు సంబంధించిన పాస్ బుక్కులు మాత్రం తమ దగ్గర లేవని సర్పంచ్ దృష్టికి పలువురు తీసుకొచ్చారు. అందుకు గ్రామ సర్పంచ్ కె. నాగిరెడ్డి మాట్లాడుతూ ఎవరు బుక్కులు వారికి వెంటనే ఇవ్వాలని ఆదేశించా రు.ఈ విషయంపై ఇదివరకే తెలియజేశానని.. మళ్లీ నీవు వారి బుక్కులను నీ దగ్గర పెట్టుకుంటే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుంద ని హెచ్చరించారు.ఈ సమయంలోనే పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ పింఛన్దారుల ఖాతాలు తప్పనిసరిగా పోస్ట్ ఆఫీస్ లోనే ఉండాలనే నిబంధన లేదని స్పష్టం చేశారు.పింఛన్ల పంపిణీ ప్రస్తుతం పోస్ట్ ఆఫీస్ ద్వారా జరుగుతుందన్నారు. పింఛన్దారుల ఖాతాలు ఎక్కడ ఉండాలనే విషయంపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయలేదని,ఖాతాలు ఎక్కడ ఉండాలనే విషయంపై స్పష్టత వస్తుందని, అంతవరకు ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు. ప్రతినెల పింఛన్ల కోసం తాం తెల్లవారుజామున బీపీఎం ఇంటికి వెళ్లి పాసుబుక్కులు పెడుతున్నామని పలువురు మహిళలు తెలిపారు.ఆ సమయంలో ఎందుకు వెళ్లి పెడతారని..రోజువారిగా పింఛన్లు ఇచ్చి పంపించాలని, తెల్లవారుజామున నుంచి వారి చేత ఎందుకు ఖాతాలు పెట్టించుకుంటారని సర్పంచ్ బీపీఎంను ప్రశ్నించారు.

### బీపీఎం ఇబ్బందులు పెడితే ఫిర్యాదు చేయండి

ఈ మెరకే సింగారం బీపీఎంపై పలు ఫిర్యాదులు ఉన్నాయని,ఇకనుంచి నీవు సక్రమంగా విధులు నిర్వహించాలని గ్రామ సర్పంచ్ కె.నాగిరెడ్డి తెలిపారు.ఒకవేళ ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని సర్పంచ్ ఈ సందర్భంగా హెచ్చరించారు.ఒకవేళ బీపీఎం ఎవరికైనా ఇబ్బందులు పెట్టినట్లయితే వారి ఉన్నత అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయాలని సర్పంచ్ గ్రామ ప్రజలకు సూచించారు.మన సమస్య కొరకు వెంటనే ఫిర్యాదు చేయాలని..ఒకవేళ ఫిర్యాదు చేయకపోతే ఇదేవిధంగా వ్యవహారం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.ఉపాధి హామీ కూలీ డబ్బుల డ్రాకు స్లిప్పు లేవని పలువురు పేర్కొన్నారు.

స్టేషనరీ కొరత ఉందని బీపీఎం స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా గ్రామ సభ పేరిట మంగళవారం ఉదయం బీపీఎం పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో పలువురు పింఛన్దారులు నేరుగా గ్రామపంచాయతీ కార్యాలయానికి తరలి వెళ్లి సర్పంచ్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. తాము పింఛన్లు ఇవ్వవద్దని చెప్పలేదని ఆయన స్పష్టం చేశారు. నారాయణపేట మండలం సింగారం బీపీఎం (బ్రాంచి పోస్ట్ మాస్టర్)పైనే ఫిర్యాదుల పరంపర కొనసాగి గ్రామసభ ముగిసింది.

# అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా!



భారత్-అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో భారత్‌పై అమెరికా టారిఫ్‌లు 18 శాతానికి తగ్గాయి. ఇక అదే సమయంలో అమెరికా భారత్‌పై మరో ఒత్తిడి పెంచింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు తగ్గించాలని ఆదేశించింది. భారత్‌తో సంబంధం లేకుండానే డొనాల్డ్ ట్రంప్.. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు తగ్గిస్తోందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ ఎలాంటి ప్రకటన చేయలేదు. మంత్రి పీయూష్ గోయల్ మాత్రం రష్యా ఆయిల్ కొనుగోలు ట్రేడ్‌లో భాగం కాదని ప్రకటించారు.భారత్-అమెరికా మధ్య ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దానికి ముందు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% టారిఫ్‌లను 18%కి తగ్గించారు. వాణిజ్య ఒప్పందం తర్వాత ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్ రష్యా ఆయిల్ కొనుగోలు తగ్గించి అమెరికా, వెనెజువెలా నుంచి కొంటుందని ప్రకటించారు. దీనిపై భారత్ అధికారికంగా స్పందించక పోయినా, గణాంకాలు మార్పును నిర్ధారిస్తున్నాయి. పుతిన్ దీన్ని భారత నిర్ణయంగా గుర్తించారు.2025 డిసెంబర్‌లో రష్యా నుంచి 2.7 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ దిగుమతి చేసుకుంది. నవంబర్‌లోని 3.8 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ కొనుగోలు చేసింది. అంటే నెల రోజుల్లో ఆయిల్ దిగుమతి 27% తగ్గించింది. మొత్తం భారత ఆయిల్ దిగుమతిలో రష్యా వాటా 34% నుంచి 24.9%కి పడిపోయింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 15% కొనుగోలు తగ్గింది. 38 నెలలుగా రష్యా నుంచి జరుగుతున్న కొనుగోలులు ఇదే తక్కువ.అమెరికా నుంచి 2025 డిసెంబర్ దిగుమతులు 2024తో పోలిస్తే 31% పెరిగాయి. రష్యా నుంచి 15 శాతం తగ్గితే.. అమెరికా నుంచి దిగుమతి రెట్టింపైంది. వెనెజువెలా కూడా ప్రధానంగా చేరుతోంది. ఇది ట్రంప్ వాగ్దానాలకు సమానంగా ఉంది, కానీ ఆర్థిక లాభాలు ప్రశ్నార్థకం.రష్యా ఆయిల్ రవాణా ఖర్చు అమెరికా ఆయిల్ షిప్పింగ్ చార్జీలతో పోలిస్తే సగం ఉంటుంది. రష్యా నుంచి మనం రూపాయిల్లో కొనుగోలు (పెట్రో రూపీ ఇన్వెస్ట్‌మెంట్) చేశాం. ఆ రూపాయలను కూడా రష్యా భారత్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. అమెరికా నుంచి డాలర్లలోనే లావాదేవీలు జరుపుతున్నాం. ఇక అమెరికా నుంచి రవాణాకు భారత్ బ్యారెల్‌కు 4 నుంచి 5 డాలర్లు అదనంగా చెల్లించాలి. వెనెజువెలా ఆయిల్ కొటే బ్యారెల్‌కు 10 డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. రష్యా ఆయిల్ తక్కువగా వస్తున్నా.. అమెరికా ఒత్తిడి కారణంగానే మోదీ రష్యా ఆయిల్ తగ్గించి అమెరికా ఆయిల్ పెంచినట్లు చర్చ జరుగుతోంది.ఆయిల్ తగ్గుదల అమెరికా ఒత్తిడికి సూచన. తదుపరి రష్యా ఆయుధాలపై ఆంక్షలు, అమెరికా సామగ్రిని కొనుగోలు డిమాండ్ రావచ్చు. ఇది భారత విదేశాంగ వ్యూహాన్ని పరీక్షిస్తుంది.ఇదిలా ఉంటే భారత్‌కు రష్యా ఆయిల్ దిగుమతి తగ్గింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 2025లో 15% తగ్గుదల నమోదైంది. నవంబర్‌డిసెంబర్ మధ్య 27% తగ్గుదల.నమోదైంది. ఇక ఇదే సమయంలో అమెరికా దిగుమతులు 31% పెరిగాయి. దీంతో భారత్ అమెరికా ఒత్తిడికి తలొగ్గుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.రష్యా, ఇరాన్ నుంచి బ్యారెల్ ఆయిల్ రవాణాకు షిప్పింగ్ చార్జి ఒక డాలర్ ఖర్చు అయ్యేది. అమెరికా, వెనెజువెలా నుంచి రవాణ చేయడానికి 3 నుంచి 5 డాలర్లవరకు కర్చు చేయాల్సి వస్తుంది. దీంతో భారత్‌పై రవాణా భారం మూడు రెట్లు పెరుగుతుంది. ఇక రష్యా, ఇరాన్ నుంచి భారత్ రూపాయల్లోనే ఆయిల్ కొనుగోలు చేస్తోంది. అమెరికా నుంచి కొనాలంటే డాలర్లలో కొనాలి. రష్యా రూపాయలను భారత్‌లోనే పెట్టుబడి పెట్టేలా రిజర్వ్ బ్యాంకు అవకాశం కల్పించింది. దీంతో మన దేశంలో పెట్టుబడులు పెరిగాయి. డాలర్‌లో కొనుగోళ్లు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతాయి. రష్యా వ్యవస్థ ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రవాహాన్ని పెంచుతుంది. అమెరికా మార్పు దీర్ఘకాలిక ఖర్చులు పెంచి, ఆర్థిక సమతుల్యాన్ని భంగపరుస్తుంది.ఆయిల్ మార్పు భవిష్యత్ ఆయుధ కొనుగోళ్లలో అమెరికా ఒత్తిడికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఆంక్షల్లా రష్యా మార్పు భారత వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని పరిమితంచేస్తుంది.

చైనా,యూరప్‌కొనుగోళ్లు కొనసాగు తుంటే భారత్ పై మాత్రమే అమెరికాఒత్తిడి చేయడం గమనార్హం. స్వాతంత్ర్య నిర్ణయాలు ఆర్థిక ఒత్తిడికి గురవకూడదు.రష్యా ఆధారం తగ్గడం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఆత్మనిర్భర్ ఎనర్జీ, వైవిధ్య మైన మూలాలు అవసరం. అమెరికాకు పూర్తి తలొగ్గడం దీర్ఘకాలిక ప్రమాదం. సమతుల్య వాణిజ్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కీలకం.

# కొరియన్ లవ్ గేమ్.. ఢిల్లీలోనే 800 మంది మిస్సింగ్

న్యూఢిల్లీ, : ధ్రువ సినిమా చూశారా.. అందులో రామ్ చరణ్ శరీరంలో ఒక బగ్ ఉంటుంది. దాని ద్వారా అరవింద్ స్వామి రామ్ చరణ్ మాట్లాడిన మాటలు మొత్తం వింటూ ఉంటాడు. అతడు చేసే పనులకు కౌంటర్ ఇస్తూ ఉంటాడు. రామ్ చరణ్ ను చాలా ఇబ్బంది పెడుతూ ఉంటాడు. అటువంటి బగ్ మన శరీరంలో ఒకటి ఉంటే.. అది కూడా ఒక ఫోన్ రూపంలో ఉంటే.. ఎలా ఉంటుంది.. చదువుతుంటే ఆందోళన కలుగుతుంది కదూ.. మనదేశంలో ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలో ఘజియాబాద్ నగరంలో ముగ్గురు సోదరీమణులు ఒకరి వెంట ఒకరు బలవంతంగా చనిపోయారు. దీని వెనుక భయంకరమైన కారణాలు ఉన్నాయి.రియన్ సినిమాలు అంటే చాలా ఇష్టం. కొరియన్ డ్రామాలు బాగుంటాయి. కొరియన్ సినిమాలలో నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటుంది. ప్రారంభం నుంచి చివరి వరకు కొరియన్ సినిమాల్లో డ్రామా.. ఉత్కంఠ.. ముని వేళ్ళ మీద నిలబెట్టే ఉద్వేగం ఇలా చాలా ఉంటాయి. అందువల్లే చాలామంది కొరియన్ సినిమాలను ఇష్టపడుతుంటారు.ప్రపంచానికి భిన్నంగా.. ఆలోచించడం కొరియన్ ప్రజలకు ఇష్టం. టెక్నాలజీతో వారు ఒక ఆట ఆడుకుంటారు. అయితే ఇతరుల భావోద్వేగాలను తమ గుప్పెట్లోకి తీసుకోవడం చాలా మంది కొరియన్ ప్రజలకు అలవాటు. దాన్ని ఒక ఆనందంగా వారు భావిస్తుంటారు. ప్రపంచం మొత్తం తమ చేతిలో ఉంది అని అనుకుంటారు. అందువల్లే కొరియన్ నిపుణులు కొంతమంది గేమ్స్ రూపొందించారు. ఈ గేమ్స్ కు సంబంధించిన ఏ వ్యవహారం కూడా అధికారికంగా బయటికి కనిపించదు. తయారీదారులు కూడా వారి వివరాలు బయటపెట్టరు. రకరకాల మాధ్యమాలలో తమ గేమ్స్ గురించి ప్రమోషన్ చేసుకుంటారు. ముఖ్యంగా యుక్త వయసు పిల్లల్ని లక్ష్యంగా చేసుకొని ఏదో ఒక రూపంలో వారికి దగ్గరవుతారు.“నువ్వు స్మార్ట్ గా ఆలోచిస్తున్నావ్. నీ కళ్ళల్లో స్పార్క్ కనిపిస్తోంది. మీ అమ్మానాన్న పెట్టిన పేర్లతోనే నువ్వు ఉంటావా.. ఈ కొరియన్ పేరు ట్రై చెయ్.. అసలు నువ్వు స్కూల్ కి ఎందుకు వెళ్లాలి.. ఈరోజు కాలేజీకి ఎందుకు బంక్ కొట్టకూడదు.. నువ్వు ఒంటరిగా ఉంటూ జీవితాన్ని ఎందుకు ఆస్వాదించకూడదు.. ఈ నాలుగు గోడల మధ్యలోనే నువ్వు స్వేచ్ఛను ఎందుకు కోరుకోకూడదు.. కొత్త కొత్త టాస్క్ లు చేసేయ్. నీకు ప్రతిదీ ఉద్వేగంగా ఉంటుంది. చదువుకుంటే మహా అయితే ఉద్యోగం మాత్రమే చేస్తావు. ఒక కింద బానిసలాగా పనిచేయడం నీకు అవసరమా” ఇలా రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతుంటారు.టీనేజ్ పిల్లలలో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. అదే సమయంలో కొరియన్ గేమ్స్ నిర్వాహకులు యూత్ పిల్లలను రెచ్చగొడుతుంటారు. ఒకరకంగా వారిని తమ ఆధీనంలోకి తీసుకుంటారు. ప్రతిరోజు ఒక టాస్క్ ఇస్తూ ఉంటారు. ఆ టాస్క్ పూర్తి చేసిన తర్వాత నువ్వు ప్రపంచం లోనే ధీరుడువి.. నీలాంటి శక్తివంతుడు ఎవరూ లేరు.. ఈ ప్రపంచంతో నీకే సంబంధం.. నీకై నువ్వు ఒంటరిగా వచ్చావు కదా.. ఒంటరిగా వెళ్తే తప్పేంటి అన్నట్టుగా యువతలో లేనిపోని ఉద్వేగాలను నూరిపోస్తుంటారు.ఆ తర్వాత వారిని తమ ఆధీనంలోకి పూర్తిగా




తీసుకున్న తర్వాత.. ఈ ప్రపంచం తో నీకు సంబంధం లేదు.. నువ్విక వెళ్ళిపోవచ్చు.. ఈ టాస్క్ లో కనుక నువ్వు చనిపోతే విజేతవు.. అంటూ ఒక రకమైన ఉద్వేగాన్ని రుద్దుతారు. ఫలితంగా ఇదంతా నిజమే అని భ్రమపడి పిల్లలు.. కొరియన్ గేమ్స్ నిర్వాహకులు చెప్పినట్టుగా చేస్తుంటారు. చివరికి వారు తన ప్రాణాలను కూడా కోల్పోతుంటారఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ నగరంలో జరిగింది పైతరహా దారుణమే. అయితే ఇప్పటికీ ఈ విషయంలో ఇంకా కొన్ని తెలియని నిజాలు బయటికి రావాల్సి ఉంది. ఈ ఘటనలో ఆ ముగ్గురు పిల్లల తండ్రి చెబుతున్న మాటలు పొంతన లేకుండా ఉన్నాయి. ఇంకా దర్యాప్తు సాగుతుంది కాబట్టి ఈ వ్యవహారంలో కొన్ని విషయాలను బయటకు చెప్పడం సాధ్యం కావడం లేదు.ఘజియాబాద్ ఘటన తర్వాత కొరియన్ గేమ్స్ పై చర్చ మొదలైంది. ముఖ్యంగా బ్లూ వేల్ గేమ్ ను బ్యాన్ చేయాలని డిమాండ్ కూడా వ్యక్తం అవుతుంది.


# హమ్మయ్య.. ఆ ఉగాండా మహిళకు ఎబోలా నెగెటివ్..!




ఆఫ్రికా దేశాల్లో వేగంగా వ్యాపిస్తోన్న ఎబోలా పై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఉగాండా నుంచి బెంగళూరుకు వచ్చిన ఓ మహిళలో ఈ వైరస్ లక్షణాలు కనిపించడంతో.. వెంటనే అప్రమత్తమైన వైద్య విభాగం ఆమెకు పరీక్షలు నిర్వహించింది. తాజాగా ఆమెకు నెగెటివ్ రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయాన్ని కర్ణాటక ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు ధ్రువీకరించారు. "ఎబోలా కట్టడికి ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. ప్రజలు ఆందోళనకు గురికావొద్దు. ప్రభుత్వం, వైద్య విభాగం జారీ చేసే సమాచారంపై మాత్రమే ఆధారపడాలి" అని సూచించారు. ఈ నెల 23న ఉగాండా దేశానికి చెందిన మహిళ ఒకరు కెంపెగౌడ విమానాశ్రయంలో దిగారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తుండటంతో.. ఈ మహిళలో ఎబోలాకు సంబంధించి స్వల్ప లక్షణాలు బయటపడ్డాయి. దాంతో ముందుజాగ్రత్త చర్యగా ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించి ఐసోలేషన్‌లో ఉంచారు. ఆమె శాంపిల్స్ సేకరించి, పరీక్షల కోసం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (చీ×ఎ)కి పంపించగా.. తాజాగా ఫలితాల్లో నెగెటివ్ అని తేలింది.

దేశంలో మండుతున్న ఎండలు.. ప్రజలకు జాగ్రత్తలు చెప్పిన ప్రధాని బుండిబుగ్యో ఎబోలాకు రష్యా వ్యాక్సిన్..! ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాప్తిపై ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో రష్యా కీలక ప్రకటన చేసింది. బుండిబుగ్యో ఎబోలా^ు వ్యాక్సిన్ కనుగొన్నట్లు రష్యా ఆరోగ్య మంత్రి మురాష్కో వెల్లడించారు. దక్షిణాఫ్రికాలోని రష్యా దౌత్యకార్యాలయం ఈ మేరకు 'ఎక్స్'లో ప్రకటన చేసింది. రష్యన్ శాస్త్రవేత్తలు ఎబోలా కొత్త స్ట్రెయిన్ కోసం విజయవంతమైన వ్యాక్సిన్‌ను కనుగొన్నట్లు తెలిపింది. ఇది బుండిబుగ్యో స్ట్రెయిన్ నుంచి రక్షణ కల్పిస్తుందని వెల్లడించింది. ఈ మహిళలో ఎబోలాకు సంబంధించి స్వల్ప లక్షణాలు బయటపడ్డాయి. దాంతో ముందుజాగ్రత్త చర్యగా ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించి ఐసోలేషన్‌లో ఉంచారు. ఆమె శాంపిల్స్ సేకరించి, పరీక్షల కోసం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (చీ×ఎ)కి పంపించగా.. తాజాగా ఫలితాల్లో నెగెటివ్ అని తేలింది.

# పీడీఎస్ బియ్యం కనిపెట్టేలా మొబైల్ టెస్టింగ్ కిట్స్..!




కాకినాడ: పీడీఎస్ బియ్యం మాఫియా అనగానే కాకినాడ పేరు ఠక్కున గుర్తుకు వస్తుంది.. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై అంతటిస్థాయి వివాదం కాకినాడ చుట్టూ ముసురుకుంది.. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ పద్ధతిలో సేకరించిన పేదల బియ్యాన్ని చివరకు కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు తరలించి అక్రమ సొమ్మును ఆర్జిస్తున్నారన్న ఆరోపణలపై ఎన్నికలకు ముందు నుంచి పెద్ద దుమారమే రేగింది.. ఈనేపథ్యంలోనే ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పీడీఎస్ బియ్యం మాఫియా అంతుచూస్తామని కూడా వాగ్ధానాలు చేశారు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే ఆదిశగా చర్యలు ప్రారంభించారు.. కూటమి ప్రభుత్వం వచ్చాక డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ కాకినాడ పర్యటకు వచ్చి నేరుగా పోర్టుకు వెళ్లారు.. అక్కడ అక్రమంగా ఎగుమతి అవుతున్న పీడీఎస్ బియ్యం ను టన్నుల కొద్దీ గుర్తించి సీజ్ చేయించారు.. ఆతరువాత ఏపీ సివిల్ సప్లై మి నిస్టర్ నాదెండ్ల మనోహర్ కూడా మరో రెండు సార్లు కాకినాడ పోర్టులో విస్తృతంగా తనిఖీలుచేసి టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యం సీజ్ చేయించారు.. కానీ చాలా వరకు అవి పీడీఎస్ బియ్యం అని నిరూ పించలేని పరస్థితి తెలెత్తింది.. ఇదిలా ఉంటే కాకినాడ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టులకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ను అడ్డుకునేందుకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించినప్పటికీ అవికూడా అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వలేకపోయాయి.. కానీ యధారాజా తథా ప్రజా అన్న చందంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా అనే నియంత్రణ కాలేని పరిస్థితి కనిపిస్తోంది..గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా జరిగిన రేషన్ బియ్యం అక్రమ రవాణా కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా నియంత్రణ కాలేని పరిస్తితి కనిపిస్తోంది.. రేషన్ మాఫియాలో చాలా మంది పెద్దల హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి..

ముఖ్యంగా తీర ప్రాంతాల్లో రేషన్ మాఫియా రెచ్చిపోతుందని, దీనికి అడ్డుకట్ట వేయాలంటే చాలా ఇబ్బందులు తప్పడం లేదని అధికారులు సైతం చేతులెత్తేసిన పరిస్తితి కనిపించింది.. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి రేషన్ మాఫియాని కట్టడి చేసేందుకు మంచి

ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నట్లయ్యింది.. రేషన్ బియ్యం పట్టుకున్నా, అవి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం అని అనుమానాలున్నా పీడీఎస్ బియ్యం అని రూఢీ చేయడానికి టెస్ట్ చేయడానికి ల్యాబ్ కి పంపి వారం రోజులు వెయిట్ చేయాల్సి వచ్చేది. తాజాగా ప్రభుత్వం ఒక మొబైల్ కిట్‌ను రూపకల్పన చేయించి పంపిణీకు సిద్ధం చేసింది. మొబైల్ కిట్ లో ఉండే కెమికల్ బాటిల్స్ రేషన్ బియ్యం లో వేసినప్పుడు పోషక విలువల కోసం రేషన్ బియ్యంలో కలుపుతున్న పోర్టిఫైడ్ రైస్ ఎరుపు రంగులోకి మారతాయి.

## పొంచి ఉన్న కరువు పరిస్థితులు..?

గత ఏడాది రికార్డు స్థాయిలో వర్షాలు కురిసాయి. పంటలు సమృద్ధిగా పండాయి. కానీ ఈ ఏడాది అలా పరిస్థితి ఉండదని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రధానంగా పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా మారుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా.. 2026 లో అత్యంత బలమైన ఎల్ నినో పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు కురిసే అవకాశం కనిపించడం లేదని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వర్షాకాలం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది రైతులకు అత్యంత కష్టతరంగా మారబోతోందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే ముందుగానే ఈ హెచ్చరికలు వచ్చాయి. కానీ ఎల్ నినో ప్రభావం ఈ స్థాయిలో ఉండబోతుంది అని తెలుస్తుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.కొన్ని ప్రాథమిక విశ్లేషణల ప్రకారం ఈ ఏడాది ఇబ్బందికర పరిస్థితులు తప్పవని అర్థమవుతోంది. ఈ శతాబ్దంలోనే అత్యంత తీవ్రమైన ఉష్ణ మండల వాతావరణం నమోదయ్యే ప్రమాదం ఉంది. రుతుపవనాల గమనాన్ని అస్తవ్యస్తం చేసి.. వర్షాలు పడకుండా చేస్తోందని తెలుస్తోంది. వ్యవసాయ రంగం దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్న ప్రతిసారి మన దేశంలో వర్షపాతం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అటువంటిది ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. సుదీర్ఘమైన కరువు కాటకాలకు దారి తీయవచ్చు అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే నైరుతి రుతుపవనాలను ఎల్ నినో నాశనం చేస్తుందని చెబుతున్నారు. వర్షాలు సరిగ్గా పడక తీవ్ర దుర్భిక్షం ఏర్పడుతుందని.. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గి.. భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని.. రైతాంగం తీవ్ర పెట్టుబడి నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరికలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.మెరికా, ఇరాన్ దేశాల మధ్య నిన్నటిదాకా భీకరమైన యుద్ధం జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా ఆ యుద్ధం తాత్కాలికంగా వాయిదా పడింది. యుద్ధం వల్ల జరిగే దాడులు విపరీతమైన కాలుష్యానికి కారణమవుతుంటాయి. కాలుష్యం వల్ల వాతావరణంలో అనేక రకాలుగా మార్పులు చోటుచేసుకుంటాయి. వాటి వల్ల కరువు కాటకాలు ఏర్పడుతుంటాయి. రెండవ ప్రపంచ యుద్ధాన్ని తీసుకుంటే.. నాడు అమెరికా వేసిన న్యూక్లియర్ బాంబు వల్ల జపాన్ తీవ్రంగా నష్టపోయింది. ఆ బాంబు వేసిన ప్రాంతంలో ఇప్పటికీ పచ్చ గడ్డి కూడా మొలవడం లేదు. దీనిని బట్టి యుద్ధం లాంటి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు ప్రకృతి ఎంత ప్రభావితమవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక యుద్ధం తాత్కాలికంగా ముగిసింది అనుకుంటే.. మరో ఉపద్రవం ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతోంది. ఈసారి ప్రపంచాన్ని ఆ విధంగా కలవరపెడుతున్న అంశం యుద్ధం కాదు.. మరొకటి కాదు.. అది కరువు.

# భూమా మౌనికకు దారేది?



కర్నూలు, : భూమా మౌనిక రెడ్డి రాజకీయ అరంగేట్రం ఖాయం అని తేలిపోయింది. ఈ విషయాన్ని స్వయంగా సినీ నటుడు ఆమె భర్త మంచు మనోజ్ వెల్లడించారు. భూమా మౌనికా రెడ్డికి రాజకీయాలు కొత్త కాదని ఆయన చెప్పుకొచ్చారు. భూమా నాగిరెడ్డి శోభా నాగిరెడ్డి వారసురాలిగా ఆమె భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టబోతున్నారు అని మనోజ్ సంచలన ప్రకటన చేశారు. దీంతో రాయల సీమ రాజకీయాలతో పాటు కర్నూల్ ఆళ్ళ రాజకీయాల్లో కొత్త చర్చ వేడిగా వాడిగా రాజుకుంటోందివిషయానికి వస్తే భూమా కుటుంబానికి కర్నూలు జిల్లాలో ఎంతటి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయో అందరికీ తెలిసిందే. రాజకీయంగా ఆ కుటుంబం జిల్లాలో కీలక పాత్ర పోషించింది. భూమా నాగిరెడ్డి శోభా నాగిరెడ్డి దంపతులు రాజకీయాల్లో తమదైన శైలిలో ప్రాధాన్యతతో కూడిన పాత్ర పోషించారు. వారు దివంగతులు కావడంతో ఆ కుటుంబంలో బిడ్డలు ఇపుడు రాజకీయంగా తమ అవకాశాల కోసం ఎవరి ప్రయత్నాలలో వారు ఉన్నారు. ఇప్పటికే భూమా నాగిరెడ్డి దంపతుల రాజకీయ వారసురాలిగా రంగ ప్రవేశం చేసిన అఖిల ప్రియ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు..గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రి కూడా అయ్యారు. ప్రస్తుతం ఆమె ఆళ్ళగడ్డ సిట్టింగ్ ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున ఉంటూ గట్టి పట్టు సాధించారుఇదిలా ఉంటే భూమా నాగిరెడ్డి దంపతుల రెండవ కుమార్తె మౌనిక రెడ్డి ఇప్పుడు రాజకీయాల వైపు చాలా ఆసక్తిగా చూస్తున్నారు అని అంటున్నారు. మంచు మనోజ్ ఈ విషయాని ధృవీకరించడంతో పాటు మౌనికా రెడ్డిది రాజకీయ కుటుంబమే అని స్పష్టం చేయడంతో భూమా మౌనిక రెడ్డి రాజకీయానికి తెర లేచినట్లు అయింది. భూమా కుటుంబంలో ఇద్దరు ఆడబిడ్డలు ఒక సోదరుడు రాజకీయ వారసత్వం విషయంలో పోటీ పడే పరిస్థితి వచ్చిందా అన్న చర్చ కూడా ఉంది. అయితే అఖిలప్రియకు గతంలో మౌనికా రెడ్డి రాజకీయంగా అండగా నిలిచి ఆమె విజయం వెనక ఉన్నారు. ఇక వారి సోదరుడు జగద్విఖ్యాత రెడ్డి కూడా అఖిలప్రియ వెంట ఉన్నారు. మౌనికా రెడ్డి రాజకీయాల్లోకి వస్తే ఆమె దారి ఏ వైపు అన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఇక భూమా మౌనిక రెడ్డి రాజకీయంగా తన సొంత దారిలో వెళ్తారా అన్నది కూడా చర్చకు వస్తోంది. ఆమెకు మంచు మనోజ్ పూర్తి మద్దతుగా నిలుస్తారని చెబుతున్నారు. ఇప్పటికే సేవా కార్యక్రమాలు చేస్తూ ఈ దంపతులు ప్రజల మన్నన పొందుతున్నారు. రాజకీయాలు పట్ల ఆసక్తి కూడా ఉన్నట్లుగా ప్రకటనల ద్వారా తెలియజేస్తున్నారు. మంచు మనోజ్ తన పుట్టినరోజు సందర్భంగా తన సతీమణి రాజకీయ రంగ ప్రవేశం మీద తాజాగా కీలక వ్యాఖ్యలే చేశారు. దాంతో ఆమె ఎక్కడి నుంచి పోటీ చేస్తారు, ఏది పార్టీ నుంచి చేస్తారు, ఎంపీగానా లేక ఎమ్మెల్యేగానా ఇవన్నీ చర్చకు దారి తీస్తున్నాయిఇక భూమా కుటుంబానికి తెలుగుదేశం పార్టీతోనూ వైసిపితోనూ ప్రజా రాజ్యంతోనూ సంబంధాలు ఉన్నాయి. భూమా దంపతులు ఈ మూడు పార్టీల నుంచి ప్రజా ప్రతినిదులు అయ్యారు. దాంతో తెలుగుదేశంలో అక్క అఖిలప్రియ రాజకీయంగా స్థిరపడినందున మౌనికా రెడ్డి వేరే ప్రత్యామ్నాయలు చూసుకుంటారా అన్న చర్చ కూడా సాగుతోంది. ప్రజారాజ్యంలో భూమా దంపతులు పనిచేసిన కారణంగా జనసేనలో ఏమైనా అవకాశం సంపాదించి అక్కడ నుంచి పోటీ చేస్తారా అన్నది కూడా మరొక చర్చగా ఉంది. ఏది ఏమైనా భూమా మౌనిక రెడ్డి రాజకీయ రంగ ప్రవేశం మాత్రం కర్నూలు జిల్లా రాజకీయాల్లో కొత్తగా సంచలన కలిగించే అవకాశం ఉంది. అక్క చెల్లెలు ఇద్దరూ సర్దుబాటు రాజకీయంగా ముందుకు సాగుతారా లేక ఎదురు బొదురు నిలిచి పోటీ చేస్తారా, అది కూడా వేరు వేరు పార్టీ నుంచి రాజకీయంగా ముందుకు వస్తారా అన్నది సైతం చూడాల్సి ఉంది.

## ఏపీలో ఫ్రీహోల్డ్ భూములపై కీలక నిర్ణయం..!

రాజమండ్రి, : ఏపీలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించింది. ఈ మేరకు నేడే, రేపో ఉత్తర్వులు కూడా వచ్చే అవకాశం ఉ:ది. మిగిలిన భూములకు సంబంధించి త్వరలోనే సమావేశమై చర్చించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. త్వరలోనే ఈ ఫ్రీహోల్డ్ భూముల అంశంపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. భూముల సమస్యలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ అమరావతిలోన సచివాలయంలో సమావేశమైంది.. ప్రధానంగా ఫ్రీహోల్డ్ భూములు, 22ఏ, ఈనాం భూముల సమస్యపై చర్చించింది. ఫ్రీహోల్డ్ భూముల అంశంపై సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13.59 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయగా.. వీటిలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించాలనే నిర్ణయానికి వచ్చారు. మిగిలిన 5.74 లక్షల ఎకరాలపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానం చేశారు. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో కేబినెట్ సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయంతో.. లక్షలమంది రైతులకు ఊరట దక్కింది. ఈ భూముల రిజిస్ట్రేషన్లకు నిబంధనలకు అనుగుణంగా అనుమతించాలని నిర్ణయించారు. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు. 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇచ్చింది.. పేదలకు ఇచ్చిన వ్యవసాయ భూముల్ని 20 ఏళ్లు దాటిన తర్వాత విక్రయించొచ్చని ఫ్రీహోల్డ్ ఆదేశాలు ఇచ్చింది. అయితే గత ప్రబుత్వ హయాంలో భారీగా అక్రమాలు జరిగాయని.. కొంతమంది తక్కువ ధరకు పేదల నుంచి భూముల్ని కొనుగోలు చేసి.. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత ఫ్రీహోల్డ్‌గా మార్చుకునే ఆరోపణలు వచ్చాయి.నిబం ధనలకు విరుద్ధంగా లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్‌గా మార్చినట్లు ప్రభుత్వానికి నివేదికలు చేరాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఈ భూముల అంశంపై విచారణ చేయించి.. భారీగా భూముల్ని ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించింది

# వృద్ధిరేటుకు గల్ఫ్ దెబ్బ...!



## శ్రీ 6.3 శాతానికే పరిమితమంటున్న ఏడీబీ

న్యూఢిల్లీ : అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం.. భారత జీడీపీ వృద్ధికి అడ్డుపడుతున్నది. ఇప్పటికే ఈ మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల వల్ల దేశంలో ఇంధన సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇప్పుడు ఆర్థిక వృద్ధికి సైతం ఇబ్బందులు తప్పవన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే భారత జీడీపీ అంచనాలకు తాజాగా ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) కోతలు పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) 6.3 శాతానికే పరిమితం కావచ్చని ఏడీబీ వార్షిక సమావేశం సందర్భంగా దాని ప్రధాన ఆర్థికవేత్త ఆల్బర్ట్ పార్క్ మంగళవారం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అన్నారు. గత నెలలో 6.9 శాతంగా ఉండొచ్చనగా.. ఇప్పుడు అందులో 0.6 శాతం తగ్గించారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం (2027-28) 7.3 శాతం జీడీపీ నమోదు కావచ్చని ఏప్రిల్‌లో ఏడీబీ చెప్పింది. అయితే తాజా అంచనాలతో ఇది కూడా తగ్గిపోయే అవకాశాలే కనిపిస్తున్నాయి. దేశీయంగా ఉండే బలమైన డిమాండ్‌ను పెరుగుతున్న ద్రవ్యోల్బణం దెబ్బతీస్తుండటమే.. వృద్ధి అంచనాల తగ్గుదలకు కారణమన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మొదలైంది. అంతకుముందు బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 70 డాలర్లే. కానీ ఇప్పుడు 40 డాలర్ల మేర పెరిగింది. ప్రస్తుతం 110 డాలర్ల వద్ద కదలాడుతున్నది. అమెరికా క్రూడ్ బెంచ్‌మార్క్ సైతం బ్యారెల్ 100 డాలర్లకుపైగా సూచిస్తున్నది. దీంతో మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు కొనసాగితే.. ముడి చమురు రేట్లు మరింతగా విజృంభించడం ఖాయమే. ఇక పెరుగుతున్న ముడి చమురు ధరలు.. అనుబంధ రంగాలనూ దెబ్బతీస్తున్నాయి. యుద్ధం మొదలై 2 నెలలు దాటిపోవడంతో ఇప్పటికే రిటైల్ మార్కెట్లో ఆయా ఉత్పత్తుల ధరల్ని కంపెనీలు పెంచేశాయి. వివిధ రకాల సబ్బులు, రంగులు, ఎరువుల రేట్లు ప్రత్యక్షంగా.. మిగతా వాటి ధరలు పరోక్షంగా పెరగడంతో వినియోగదారులపై ఆ భారం పడుతున్నది. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో మెజారిటీ వాటా సౌదీ అరేబియా, కువైట్, ఖతార్ తదితర గల్ఫ్ దేశాలదే. రష్యా నుంచి కూడా పెద్ద ఎత్తునే కొంటుండగా.. అమెరికా ఆంక్షలు అందుకు అడ్డుతగులుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం.. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి వచ్చే ముడి చమురుకు బ్రేకులు వేసింది. అమెరికాకు అండగా నిలుస్తున్నాయని పొరుగు దేశాలపై ఇరాన్ గురి పెడుతున్నది. యూఏఈ, బహ్రెయిన్, కువైట్, ఖతార్ దేశాల్లోని చమురు, గ్యాస్ ఉత్పాదక కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నది.

# చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తా: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చైనాపై బెదిరింపులకు దిగారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే చైనాపై 50% వరకు అదనపు సుంకాలు విధిస్తామని ఆయన ప్రకటించారు. ఈ చర్య ద్వారా ఇరాన్ ఆర్థిక వనరులను అడ్డుకోవడం, చైనా వాణిజ్య ఆధిపత్యాన్ని నిరోధించడం అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ చైనా ఇరాన్ నుంచి చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తోంది. ఇది ఇరాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి సహాయపడుతున్నందున ఈ హెచ్చరిక జారీ చేయబడింది.

చైనా నుంచి వచ్చే ఉత్పత్తులపై అదనపు పన్నులు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగితే, ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తామని, 50% పన్ను విధిస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చైనా చమురు వాణిజ్యాన్ని నిలిపివేసి, దానికి బదులుగా వెనిజులా నుంచి తక్కువ ధరకు ఇంధనాన్ని అందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు.

ఇరాన్ ఆయుధాలను నిల్వ చేసుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికాఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చైనా రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో స్పందించింది. తాము యుద్ధంలో ఏ పక్షానికీ ఆయుధాలు అందించడం లేదని కూడా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక శక్తుల మధ్య జరుగుతున్న ఈ పోరాటం ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర పరిణామాలను కలిగిస్తుంది. సరఫరా గొలుసును ప్రభావితం చేయడంతో పాటు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు కూడా దారితీయవచ్చు. ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేయాలన్న అమెరికా ప్రయత్నాలకు చైనా సహకారం ఒక అడ్డంకిగా ఉంది.



## సౌత్ రాష్ట్రాల మధ్య సమన్వయం సాధ్యమేనా..?

హైదరాబాద్, : నియోజకవర్గాల పునర్విభజన , సీట్ల పెంపు అంశం ఇప్పుడు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో పెను సంచలనానికి కేంద్ర బిందువుగా మారింది. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే వాదనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలంగా వినిపిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునివ్వడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అయితే, ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఇంకా అధికారికంగా ఎటువంటి స్పష్టమైన పాలసీని ప్రకటించలేదు.కాంగ్రెస్ పార్టీకి ఇది కత్తి మీద సాము లాంటి వ్యవహారం. ఒకవేళ దక్షిణాదికి అన్యాయం జరుగుతోం ది అని కాంగ్రెస్ గట్టిగా ఉద్యమిస్తే, అది ఉత్తరాది రాష్ట్రాల్లోని ఓటర్లను కించపరిచినట్లు అవుతుందనే భయం జాతీయ నాయకత్వంలో ఉంది. ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో జనాభా ఎక్కువగా ఉన్నందున అక్కడ సీట్లు భారీగా పెరుగుతాయి. ఆ రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలని చూస్తున్న కాంగ్రెస్‌కు, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కొంత ఇబ్బందికరంగా మారేఅవకాశం ఉంది.జాతీయ పార్టీగా దేశమంతటా ఒకే విధానాన్ని అనుసరించాల్సి ఉండటంతో, అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధోరణి చూస్తుంటే, ఆయన జాతీయ రాజకీయాల కంటే తెలంగాణ, దక్షిణాది ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నట్లు కనిపిస్తోంది. జాతీయ నాయకత్వం ఆలోచనలతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సెంటిమెంటును పట్టుకోవడంలో ఆయన సిద్ధహస్తుడు. దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో నష్టం జరిగితే, అది నిధుల కేటాయింపు, రాజకీయ ప్రాతినిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే, పార్టీ లైన్ కంటే ప్రాంతీయ ప్రయోజనాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ. 50 శాతం సీట్లు పెంచాలనే ప్రతిపాదన అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది కాబట్టి, దీన్ని కేవలం ఒక ప్రాంతానికి అన్యాయంగా చూడలేమని కొందరు నిపుణులు వాదిస్తున్నారు.

## విముక్తి లభిస్తుందేమో..?!

ఇరాన్ యుద్ధంలో రెండు వారాలపాటు విరామం పాటించేందుకు అమెరికా అంగీకరించడం, ఇజ్రాయెల్ తలూపడంతో ప్రపంచం హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నది. ఈ విరామం సంపూర్ణ యుద్ధ విరమణగా పరిణమించాలనే ఆకాంక్ష చమురు, వంటగ్యాస్ సంక్షోభం నుంచి ఇకనైనా విముక్తి లభిస్తుందేమోననే ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతున్న ది. అంతిమ ఫలితాల మాట అటుంచి ఈ యుద్ధ విరామమే ఓ కీలక మలుపు. ఇరాన్ దీనిని ఘన విజయంగా చెప్పుకోవడం, ఆ దేశ ప్రజలు వీధుల్లోకి వచ్చి హర్షామోదాలు తెలియజేయడం విశేషం. ఆ సంగతి అలా ఉంచితే, ఇప్పటివరకు జరిగిన పరిణామాల్లో ఎవరెక్కడ నిలుస్తారో, ఎవరేమిటో అంచనా వేసుకునేందుకు ఇది సరైన సమయం. ఈ యుద్ధాన్ని ఎగదోసింది ఇజ్రాయెల్ అయితే వెనుకా ముందూ చూసుకోకుండా, నిర్దుష్టమైన వ్యూహం, నికరమైన లక్ష్యం అంటూ ఏదీ లేకుండా దాడికి తెగబడ్డ అమెరికాకు ఘోర పరాభవాన్ని తెచ్చిపెట్టింది. ఇరాన్ విధించిన పది షరతులకు అగ్రరాజ్యాధినేత అధ్యక్షుడు ట్రంప్ బేషరతుగా తలొగ్గడమే ఇందుకు నిదర్శనం. అందులో అతి ముఖ్యమైనది హొర్ముజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యాన్ని ఒప్పుకుని, టోల్ చెల్లింపు ఏర్పాటుకు తలూపడం అమెరికా తలవంపులకు పరాకాష్ట. కా ల్పుల విరమణ షరతుల ప్రకారం హొర్ముజ్‌లో ఇరాన్ బలగాలు నౌకల రాకపోకలను నియంత్రిస్తాయి. అందుకు గాను టోల్ కూడా వసూలు చేస్తాయి. అంటే యుద్ధానికి ముందు జలసంధిలో స్వేచ్ఛగా విహరించిన నౌకలు ఇప్పుడు సుంకాలు చెల్లిం చుకోవాల్సి ఉంటుంది. ఇదీ ట్రంప్ దుస్సాహసిక యుద్ధం సాధించిన ఘనమైన ఫలితం! డొనాల్డ్ ట్రంప్ నిలకడ లేని మాటలతో అగ్రరాజ్యం విశ్వవేదికపై అపహాస్యం పాలైంది. ఆయన నిస్పృహకు గురై సభ్యసమాజం ఏమాత్రం ఆమోదించలేని బూతులకు లంకించుకోవడం, ఇరాన్ నాగరికతనే పూర్తిగా నేలమట్టం చేస్తానని హూంకరించడం వంటివి అమెరికాతోపాటుగా ప్రపంచ ప్రజలకు వెగటు పుట్టించాయి. అటు అగ్ర నాయకత్వాన్ని వరుసపెట్టి తుదముట్టిస్తున్నా చెక్కుచెదరని దీక్షతో, మొక్కవోని ధైర్యంతో నిలబడింది ఇరాన్. శత్రువు అంచనాలను తల్లకిందులు చేసి తెగించి పోరాడింది. గంటలు, రోజుల నుంచి యుద్ధం వారాలకు, నెలలకు పాకింది. ఓవైపు ఇజ్రాయెల్‌తో పాటుగా పశ్చిమాసియాలోని అమెరికా 'మిత్రదేశాల'పై క్షిపణుల వర్షం కురిపిస్తూ, పశ్చిమాసియా నౌకారవాణాకు ముఖద్వారమైన హొర్ముజ్‌పై ఇరాన్ పట్టు బిగించింది. అమెరికా యుద్ధ నౌకలను తరిమి కొట్టింది. హొర్ముజ్‌పై దాడికి నాటో దేశాలు, జపాన్ నిరాకరించడంతో అమెరికా ఒంటరి అయ్యింది. ట్రంప్ మొదలుపెట్టిన పనికిమాలిన యుద్ధం అందించిన ఫలితాల్లో ఇది ఒకటి. ఇక మరో ముఖ్య పరిణామం.. అమెరికా–ఇజ్రాయెల్ రెజీమ్ చేంజ్ (ప్రభుత్వ మార్పు) వ్యూహం బెడిసికొట్టడం. సర్వాధికారి అలీ ఖమేనీని హతమారిస్తే అతని కుమారుడు ఆ పదవిలోకి రావడం రెజీమ్ చేంజ్ కానేరదు.

## రాజీనామానే బ్రహ్మాస్త్రం

అమరావతి, : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలా మంది ఎమ్మెల్సీలు గుడ్ బై చెప్పారు. పార్టీకి రాజీనామా చేయడంతో పాటు పదవులను వదులుకునేందుకు సిద్ధపడ్డారు. కానీ వారి రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. దీంతో వారు న్యాయ పోరాటం చేయడం ప్రారంభించారు. దీంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి మండలి ఛైర్మన్ కు ఏర్పడింది. అందుకే రాజీనామా చేసిన వారిని పిలిపించి వివరణ తీసుకుంటున్నారు మండలి ఛైర్మన్ మోసేన్ రాజు. నిన్ననే ఛైర్మన్ ను కలిసి వివరణ ఇచ్చారు జయ మంగళం వెంకటరమణ. ఈరోజు మిగతా ఎమ్మెల్సీలు సైతం ఛైర్మన్ ను కలిసి తమ వివరణ ఇచ్చారు. తప్పకుండా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం మండలి ఛైర్మన్ కు ఏర్పడింది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. ఓ నలుగురు రాజ్యసభ సభ్యులతో పాటు ఏడుగురు వరకు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యుల రాజీనామాకు ఆమోదం లభించడం.. వారి స్థానంలో కొత్త వారి ఎన్నిక కూడా పూర్తయింది. కానీ ఎమ్మెల్సీల విషయంలో మాత్రం రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. ఎందుకంటే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉంది. ఈ ఐదుగురి రాజీనామాను ఆమోదిస్తే ఈ పదవులన్నీ కూటమి ఖాతాలో చేరుతాయి. మండలిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ బలం కూడా పడిపోతుంది. దాదాపు ఏడాదిన్నరకు పైగా తొక్కి పెట్టారు రాజీనా మాలను మండల ఛైర్మన్. కానీ ఇప్పుడు కోర్టు ఆదేశాలతో వారి వివరణ తీసుకుని ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి మండలి ఛైర్మన్ ది.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 30 మంది వరకు ఎమ్మెల్సీల బలం ఉంది. కూటమికి శాసనమం డలిలో పదిమంది మాత్రమే సభ్యులు ఉన్నారు.

# చమురు మంటలు.. సామాన్యులే సమిధలు!




ఆకస్మికంగా తలెత్తిన చమురు సంక్షోభంతో భారత్ అల్లాడుతోంది. పెట్రోలు బంకుల్లో కొరత కనిపిస్తోంది. భయాందోళనలతో ప్రజలు ఎక్కువెక్కువగా కొనుగోలు చేస్తుండటంతో నిల్వలు ఖాళీ అవుతున్నాయి. కొన్ని పంపుల దగ్గర భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. క్యాబ్‌లు, ఆటోవాలాలు ట్రిప్పులు రద్దు చేసుకుంటున్నారు. వంటగ్యాస్ సమస్యతో హోటళ్లు మూతపడుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధం మన దేశంలో సామాన్య జనజీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇంధన అందుబాటుకు సంబంధించి దేశవ్యాప్తంగా నెలకొన్న గందరగోళానికి మూలాలు ఫిబ్రవరి చివర్లోనే పడ్డాయి. ఆపరేషన్ ఎపిక్‌ఫ్యూరీలో భాగంగా అమెరికా–ఇజ్రాయెల్‌లు ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన దాడుల్లో సుప్రీం నేత ఖమేనీ మరణించడంతో ప్రతీకార జ్వాలలు ఎగసిపడ్డాయి. కీలకమైన చమురు మౌలిక సదుపాయాలపై ఇరాన్ డ్రోన్‌లు, క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో సౌదీ అరామ్‌కోకు చెందిన రస్‌తానూరా రిఫైనరీ తీవ్రంగా దెబ్బతినడంతో అది పూర్తిగా మూతపడింది.

యూఏఈకి చెందిన అడ్నాక్ పుజైరా కార్యకలాపాలను 30శాతందాకా తగ్గించింది. ఖతార్‌లోని రస్‌లఫాన్ ఎల్‌ఎన్‌జీ కేంద్రం ఉత్పత్తిని నిలిపివేసింది. ఇరాక్ ఎగుమతులు రోజుకు 15లక్షల బ్యారెళ్లకు పడిపోయాయి. భద్రతాపరమైన భయాలతో కువైట్ చమురు క్షేత్రాలు నిలిచిపోయాయి. మునుపెన్నడూ లేనిరీతిలో ముప్పు ఎదుర్కొంటున్న గల్ఫ్ ఉత్పత్తిదారులు ప్లాంట్లను మూసివేయడమో, ఉత్పత్తిని బాగా తగ్గించడమో చేస్తున్నారు. ఇండియాకు ఇక్కట్లు :అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఒత్తిడి పెంచేందుకు హర్మూజ్ జలసంధిని ఇరాన్ ఒక భౌగోళిక ఆయుధంగా మార్చి ప్రయోగించింది. ఈ ఇరుకైన మార్గం ద్వారా ప్రపంచ చమురులో 20శాతం చమురుతోపాటు, భారీస్థాయిలో ద్రవీకృత సహజ వాయువు రవాణా జరుగుతుంది. అయితే, ఈ మార్గంలో రోజుకు డజన్లకొద్దీ సాగే ట్యాంకర్ల రాకపోకలు దాదాపు సున్నాకు పడిపోయినట్లు ఉపగ్రహ చిత్రాలు చూపుతున్నాయి. 150కి పైగా నౌకలు తీరానికి దూరంగా లంగరు వేసి ఉన్నాయి. ఈ మొత్తం పరిణామంలో అసలైన సమస్య బీమా కంపెనీల నుంచే ఎదురైంది. 90శాతం సముద్రయాన నౌకలకు ప్రాతినిధ్యం వహించే ఏడు ప్రధాన సంస్థలు యుద్ధ ప్రమాద రద్దు నోటీసులను జారీ చేశాయి. బీమా లేకపోతే బ్యాంకులు రుణాలు ఇవ్వవు. ఓడరేవులు ఓడలను నిలపడానికి నిరాకరిస్తాయి. యజమానులు సరకులను పక్కనపెడతారు. ఒకవేళ ఆఫ్రికాలోని కేప్ ఆఫ్ గుడ్‌హోప్ చుట్టూ తిరిగివచ్చేలా మార్గాన్ని మళ్లిస్తే, పదిహేను రోజులదాకా అదనపు సమయం పడుతుంది. ఇంధన ఖర్చులు అదనంగా లక్షల డాలర్లవుతాయి. దీనంతటి వల్ల యుద్ధ ప్రమాద ప్రీమియంలు రెట్టింపు లేదా మూడురెట్లు పెరిగిపోయాయి. కనిపించని దిగ్బంధనం మందుపాతరలు, యుద్ధనౌకలకన్నా ప్రమాదకరంగా తయారైంది. ఈ పరిణామాలకు ప్రతిస్పందనగా ప్రపంచ చమురు మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ప్రధాన ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ గణనీయంగా పెరిగింది.

ఈ పరిణామాలతో ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి దారుగా ఉన్న ఇండియా తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. తన అవసరాలలో 85శాతందాకా విదేశీ ముడిచమురుపైనే ఆధారపడి ఉంది. ఇందులో 35నుంచి 50శాతం ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్‌ల నుంచి హర్మూజ్ మార్గం ద్వారా వస్తుంది. వంటకు వాడే ఎల్‌పీజీలో సుమారు 80శాతం, ఎల్‌ఎన్‌జీలో సగం ఇదే మార్గంగుండా వస్తాయి. వ్యూహాత్మక నిల్వలు రెండు నెలల వరకు ఆసరా ఇస్తాయి. నిల్వ, రవాణాలో సుమారు 10కోట్ల బ్యారె ళ్లు ఉన్నాయి. కానీ, భయాందోళనలు ప్రణాళికలన్నింటినీ దెబ్బతీ శాయి. ఇండియన్ ఆయిల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు రష్యా, అమెరికా,బ్రెజిల్, పశ్చిమాఫ్రికాసరఫరాల కోసం పోటీపడు తున్నాయి. అమెరికా ఆంక్షల నుంచి మినహాయింపులు ఇవ్వడంతో రష్యా చమురు రాయితీపై వస్తోంది. ఇది హర్మూజ్‌యేతర మార్గాల ద్వారా వస్తూ 40శాతం డిమాండ్‌ను తీరుస్తోంది. అయినప్పటికీ గల్ఫ్ ముడి చమురు, ఎల్‌ఎన్‌జీకి పూర్తి ప్రత్యామ్నాయంగా మారలేకపోతోంది.

క్షేత్రస్థాయిలో ఈ సంక్షోభం వేగంగా విజృంభిస్తోంది. ప్రజలు భయాందోళనలతో చమురును కొనుగోలు చేస్తుండటంతో బంకులు మూతపడుతున్నాయి. కుటుంబాలు ప్రత్యామ్నాయాల కోసం వెదుకుతున్నాయి. గ్రామాలకు మార్కెట్లతో సంబంధాలు తెగిపోతున్నాయి. పట్టణాల్లో ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తున్నాయి. నమ్మకమైన రవాణా లేకపోవడంతో నగరాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. పాఠశాలలు ఆలస్యమవుతున్నాయి. కార్యాలయాలు ఖాళీ అవుతున్నాయి. ఆసుపత్రులు జనరేటర్ల కోసం ఇంధనాన్ని రేషన్ పద్ధతిలో వాడుతున్నాయి. కొన్నిరకాల పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. రవాణా, ఆహారం, విద్యుత్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఆర్థికంగా అన్ని వైపుల నుంచి తాకిడి పెరుగుతోంది. భారత ఎగుమతుల్లో 17శాతాన్ని గల్ఫ్ దేశాలు స్వీకరిస్తున్నాయి. విస్తృత మార్కెట్లకు ముఖద్వారాలుగా ఉన్న యూఏఈ, సౌదీ హబ్‌లు ఇప్పుడు సరఫరాలో జాప్యాలు, ఆకాశాన్ని అంటుతున్న రవాణా ఛార్జీలు, యుద్ధ రుసుములతో సతమతమవుతున్నాయి. దాంతో చిన్న, మధ్యతరహా ఎగుమతిదారుల లాభాలు కనుమరుగవుతున్నాయి. భౌగోళిక రాజకీయాలకు మూల్యం : పరిస్థితులు గందరగోళంగా మారడంతో ప్రభుత్వం పలు చర్యలతో రంగంలోకి దిగింది. చమురు కొరత లేదంటున్న అధికారులు ప్రశాంతంగా ఉండాలని కోరుతున్నారు. దౌత్యం ద్వారా త్వరలోనే హర్మూజ్ జలసంధి సమస్య పరిష్కారమయ్యేలా కనపడుతోంది. ముడిచమురు ధర 85–90 డాలర్ల దగ్గర స్థిరంగా ఉంటుందనే ఆశావాదం వ్యక్తమవుతోంది. భారత్ తన దగ్గరి నిల్వలతోపాటు, రష్యా సరఫరాలతో గండంలోంచి బయటపడు తుందని అంచనా వేస్తున్నారు. జీపీఎస్ జామ్‌లు, ఇరాన్ అణు బెదిరింపుల వల్ల బీమా స్తంభనలు దీర్ఘకాలం కొనసాగుతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఎరువుల కొరతపై వార్తలు రైతులకు గుబులు పుట్టిస్తున్నాయి. ఈ గందరగోళం భారతదేశ ఇంధన బలహీనతను బయటపెడుతోంది. ఇండియాతో పాటు మరికొన్ని దేశాల్లోనూ పరిస్థితులు ఇలాగే అగమ్యగోచరంగా ఉన్నాయి. సుదూర తీరాల్లోని భౌగోళిక రాజకీయాలకు సామాన్యులు మూల్యం చెల్లించాల్సిన అగత్యం నెలకొంది. యుద్ధవిరమణ దిశగా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేస్తేనే ఈ సంక్షోభం సమసిపోతుంది.

# సహజవాయువు కోసం ఉద్యమించాల్సిందే !




యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు. ట్రంప్ బెదరింపులు, హుంకరింపులతో సమస్య మరింత జటిలం అవుతోంది. ఇరాన్ కూడా తగ్గేది లేదన్నట్లుగా పోరాడుతోంది. అమెరికా యుద్ధ విమానాలను కూల్చేస్తోంది. 48 గంటల గడువు ముగిసిన వేళ, నియంత ట్రంప్ ఏ దుర్మార్గాలకు ఒడిగడతాడో తెలియడం లేదు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రం తీవ్ర గ్యాస్ కొరతను ఎదుర్కొంటోంది. సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు హోటల్ నిర్వాహకులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని తినుబండారాల ధరలు పెరుగుతున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచు తుందన్న ప్రచారం కూడా సాగుతోంది. అదే జరిగితే నిత్యావసరాల ధరలు మిన్నంటే ప్రమాదం వుంది. మరోవైపు సహజవాయువు కేటాయింపులు లేక రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు మూతబడిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా అధిక రేటుకు డిస్కంలు విద్యుత్ కొనాల్సివస్తోంది. ఈ క్రమంలో దేశీయ ంగా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్యాస్ కొరతతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. హోటల్ పరిశ్రమ కుదేలవుతోంది. కట్టెల పొయ్యి లతో కొన్నిచోట్ల నెట్టుకు వస్తున్నారు. విద్యుత్ స్టవ్‌ల ఉత్పత్తి పెరిగింది. అయితే తగినంత విద్యుత్ సరఫరా కూడా కష్టంగానే ఉంది. ఎండా కాలం కావడంతో అడపాదడపా కరెంట్ కష్టాలు మొదలు అయ్యాయి. ఈ క్రమంలో కృష్ణా–గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక్కడి సహజవాయువును గృహ, హోటల్ అవసరాలకు మళ్లించా లి. అప్పుడు డిమాండ్‌లో కనీసం 50శాతం అయినా అధిగమించగలం. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల హక్కు. ఇక్కడి వనరులు వీరికే దక్కాలి. ఈ సహజవాయువులో కనీసం సగం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని సిపిఎం అధ్వర్యంలో వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, సంస్థలకు చెందినవారు డిమాండ్ చేస్తున్నారు. ఇంధనం, గ్యాస్ సమస్యలు తీవ్రం అవుతున్నాయి. ప్రధానంగా గ్యాస్ సమస్య తీవ్రత పెరుగుతోంది. ఈ వీరి డిమాండ్ కూడా న్యాయంగా ఉన్నదే. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే డిమాండ్‌తో జనవిజ్ఞాన వేదికవంటి వివిధ సంస్థలు అనేక రూపాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాయి. అయితే ఆ తరువాత ఉమ్మడి రాష్ట్ర విభజన కోరుతూ ఆందోళనలు, ఇతరేతర కారణాలతో అది వెనక్కు వెళ్లింది. ఈ గ్యాస్ వల్ల ఎపి ఆర్థిక వ్యస్థ కూడా బలపడుతు ంది. ప్రజల సమస్యలు తీరుతాయి. దీనిపై చంద్రబాబు పట్టుబట్టాల్సిన తరుణం ఇది. అయితే కార్పోరేట్ దిగ్గజాల చేతిలో ఉన్న ఈ వ్యవహారం విషయంలో చంద్రబాబు అంత తొందరగా నోరువిప్పుతారని అనుకోరాదు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడ రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ఇక్కడ లభించే గ్యాస్ ఇక్కడి ప్రజలకు సరఫరా చేస్తే... రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడగలదు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం సమకూరుతుంది. ఈ విషయంలో స్థానిక ప్రజలే ఉద్యమాలు చేపట్టాల్సి ఉంది. బ్లో అవుట్‌లతో బాధలు పడుతున్న ప్రజలు, గ్యాస్ వల్ల లాభాలు కూడా పొందాలి. మన గ్యాస్ మనకే అని ఉద్యమించాలి. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన కృష్ణా–గోదావరి డి6 బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును రోజుకు 21 వేల టన్నులు ఉత్పత్తి అవుతోందని అంచనా. రిలయన్స్ కంపెనీ పైపులైన్లు ద్వారా ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసుకుని అక్కడ పరిశ్రమలు, ఇతర అవసరాలకు విక్రయించి వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వంట గ్యాస్ వినియోగం రోజుకు నాలుగు వేల టన్నులు. ఆయిల్ డ్రిల్లింగ్, ఇతర కార్యకలాపాలతో నిత్య కాలుష్యమేగాక బ్లో అవుట్‌లు, ఇతర ప్రమాదాల్లో రాష్ట్రం విలువైన ప్రాణాలను కోల్పోతున్నది. అత్యంత విలువైన సహజ వనరులను రాష్ట్రం కోల్పోతోంది. కనుక నష్టాలు రాష్ట్రానికి, లాభాలు రిలయన్స్‌కు చెందడం సరికాదు. ఇక్కడి సహజవాయువును కనీసం 50శాతం ఇక్కడి ప్రాంత ప్రజలకు కేటాయించిన తరవాతనే మిగతాది తరలించడం న్యాయం. మన తీరంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్ రాష్ట్రానికి కేటాయిస్తే కరెంటు కష్టాలు కూడా తగ్గుతాయి. కాబట్టి రాష్ట్రంలో లభించే ప్రకృతి వనరులను సరిగా వినియోగించు కుంటే ఇలాంటి ఇబ్బందులు రావు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో మన వాటా మనకు వస్తే రూ.950 ఉన్న సిలిండర్ ధర రూ.300– 350కు, యూనిట్ కరెంటు రూపాయికి వచ్చే అవకాశం ఏర్పడుతుంది. పిఎన్‌జి ఇంకా తక్కువ ధరకే లభిస్తుంది. చమురు, సహజ వాయువు జాతీయ సంపద కనుక రాష్ట్రానికి ఇవ్వాల్సిన న్యాయమైన వాటా ఇచ్చి మిగిలినది ఇతర రాష్ట్రాలకు తీసుకెళితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. మన సహజ వనరులను రిలయన్స్‌కు అప్పగించి, మనం ఇబ్బంది పడటం అన్యాయం.

# గాల్లో దీపమైన మహిళా, బాలికల ఆరోగ్యం!

ప్రకృతి మహిళలపై వివక్ష చూపింది. సృష్టిలోనే ఆమెకు కష్టాలను అంటగట్టింది. పురుషుడితో పోల్చితే మహిళలకు పుట్టుకతోనే కొన్ని శారీరక, జీవ వ్యవస్థలకు సంబంధించిన అసౌకర్యాలను కల్పించడం జరిగింది. మహిళ గర్భం దాల్చడం, నవ మాసాలు మోయడం, ప్రసవ వేదనను అనుభవించడం, రొమ్ముపాలు ఇస్తూ పిల్లల్ని పెంచడం, ఆరోగ్య ప్రతికూలాల నడి అబార్షన్ చేయించుకోవడం, నెలసరి రుతుస్రావం అనుభవించడం, శారీరక అవయాల్లో తేడాలతో వివక్షకు గురి కావడం లాంటివి మహిళలకు మాత్రమే కేటాయించిన సృష్టి కర్త పురుషున్ని రారాజుగా, కుటుంబ పెద్దగా నిలపడం జరిగింది. లౌంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం, మహిళా హక్కులను ప్రచారం చేయడానికి, మహిళల్ని చైతన్యవంతులుగా మార్చడానికి 1987 నుంచి ప్రతి ఏట 28 మే రోజున "అంతర్జాతీయ మహిళా ఆరోగ్య చర్యల దినం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఆక్షన్ ఫర్ వూమెన్స్ హెల్త్"ను పాటించడం ఆనవాయితీగా మారింది. 2026

అంతర్జాతీయ మహిళా ఆరోగ్య చర్యల దినోత్సవం ఇతివృత్తంగా "లైంగిక మరియు పునరుత్పత్తి ఆరోగ్యం మరియు హక్కులను (రా=ఎ=జీ) రక్షించడం మరియు అందరికీ న్యాయం అందించడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. మహిళా సాధికారత, మహిళా సమానత్వం, మహిళా ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం, సెక్స్ ఎడ్యుకేషన్ పట్ల కనీస అవగాహన కొరవడడం లాంటి సమస్యలు అనాదిగా మహిళా లోకాన్ని వేదిస్తున్నాయి. కసెక్స్ అండ్ రిప్రొడక్టివ్ హెల్త్ అండ్ రైట్ (ఎస్ఆర్‌హెచ్‌ఆర్) అంశాన్ని అవగాహన పర్చడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. మహిళల్ని వేధిస్తున్న ప్రధాన అనారోగ్యాలు: మహిళలు, బాలికలు ఆజన్మాంతం వివక్ష వలయంలో చిక్కి నరకయాతన అనుభవిస్తున్నారు. మహిళ గోడును వినే నాధుడే కరువైనాడు. ఆమెకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లేదు. పెళ్లి చేసుకోవడానికి ఆమె అంగీకారం అవసరం లేదు. గృహ హింసకు ఆమె వీపు ఓ దెబ్బలకు వేదిక. గర్భం దాల్చడానికి లేదా అబార్షన్ చేసుకోవడానికి ఆమె అనుమతి అవసరం లేదు. చివరకు భర్తతో లౌంగిక సంబంధానికి ఆమె అనుమతి అవసరం లేదు. ఆమెకు ఇష్టం లేకపోయినా, అనారోగ్యంతో ఉన్నా ఆయన చేతిలో నలిగి పోవాల్సిందే. రుతుస్రావ చక్రంలో తగు ఆరోగ్య సురక్షలు అందుబాటులో లేవు. అనారోగ్యానికి ఆమె శరీరమే వేదిక. ప్రసవ సమయంలో మరణించే మహిళల సంఖ్య కూడా ఎక్కువే. గర్భాశయ/రొమ్ము/జననేంద్రియ క్యాన్సర్, స్థూలకాయం, మధుమేహం, జననేంద్రియ అనారోగ్యాలు, తల్లి అనారోగ్యం, రుతువిరతి, నిరాశ/ఆందోళన, ఆస్టియోపోరెసిస్, ఆటోఇమ్యూన్ వ్యాధులు, పోషకాహార లోపం, శారీర వ్యాయాల లోపం, థైరాయిడ్ రుగ్మతలు, గుండె జబ్బులకు ఆమె దేహమే అనుకూలం. రక్తహీనత, లింగ వివక్ష, మూత్రనాళ అనారోగ్యాలు, మూత్రశాలలు తగినన్ని లేకపోవడం, స్థూలకాయం, లౌంగిక సంబంధ వ్యాధులు, రుతుస్రావ అనారోగ్యాలు, గర్భస్థ సమస్యలు, సంతానలేమి, లౌంగిక విజ్ఞానం లోపించడం లాంటి అంశాలతో పాటు పలు రకాల లౌంగిక సంబంధ వ్యాధులకు మహిళ లేదా బాలిక శరీరం ఓ ప్రయోగశాలగా మారింది. లౌంగిక, పునరుత్పత్తి ఆరోగ్య హక్కులను మహిళలకు విధిగా కల్పిస్తేనే సామాజిక న్యాయం, లింగ సమానత్వం, సుస్థిరాభివృద్ధి సుసాధ్యం అవుతాయి. నా శరీరం, నా హక్కు అనే నినాదం మహిళకు రక్షణ కావాలి. పురుషులు మహిళల అభిప్రాయాలకు గౌకరవం ఇవ్వాలి. మహిళల లౌంగిక, పునరుత్పత్తి ఆరోగ్య హక్కును పురుషాధిక్య సమాజం కాపాడాలి. మహిళలకు తగు స్వేచ్ఛను ఇవ్వడం, వివక్షకు దూరంగా ఉండడం, గృహ హింసకు తావులేకుండా ఉండడం నేటి సమాజ కనీస బాధ్యత.



# ఆందోళనకరంగా ద్రవ్యోల్బణం



ఢిల్లీ,:పశ్చిమాసియా సంక్షోభం, ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు.. ఇలా అనేక అంశాలు దేశ ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ధరల పెరుగుదల, చమురు అలభ్యత, రూపాయి మారకం విలువ పెరగడం వెరసి భారత జిడిపిపై తీవ్ర ప్రభావం చూపుతోంద. ద్రవ్యోల్బణానికి కూడా కారణమవుతోంది. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు ఇప్పట్లో సద్దుమణిగేలా లేవు. దీంతో ఇధంన లభ్యత ఎలా ఉంటుందో తెలియదు. ధరలు పెరగడం మాట ఎలా ఉన్నా అభ్యత అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ట్రంప్, ఇరాన్ పట్టుదలతో ఈ సంక్షోభం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హొర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయ గలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హర్ముజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్ధం వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగదారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగు తుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది. దీనికితోడు రూపాయి కనిష్ట స్థాయికి పడిపోతోంది. మారకం విలువ పడిపోవడం వివిధ రంగాలపై ప్రభావం చూపుతోంది. దీంతో రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం మరింత ఆందోళనకరంగా ఉండనుంది.

## వార్ ఎఫెక్ట్.. పీఎన్జీకి పెరుగుతున్న డిమాండ్

హైదరాబాద్: ఇరాన్ ముద్ధం మొదలై మూడూ వారాలు దాటిపోయింది. మనంసిలెండర్ గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకుని వాటి కోసం ఎదురు చూస్తూ.. రెండు వారాలు దాటిపోతోంది. అయినా కొన్ని చోట్ల సిలిండర్లు డెలివరీ అవ్వలేదు. యుద్ధం పుణ్యమా అని ముందు ముందు పరిస్థితి ఎలా ఉండబోతోందో కూడా తెలీదం లేదు. ప్రభుత్వం కూడా నెమ్మదిగా అసలు విషయాన్ని చెబుతోంది. రాబోయే రోజుల్లో సిలెండర్ సరఫరాకు ఇబ్బంది అవుతుందని ప్రజలు ప్రత్యామ్నాయాల వైపు వెళ్లాలంటోంది.. అందులో భాగంగా పైపుల ద్వారా సరఫరా చేసే సహజవాయివు ఉపయోగించాలని సూచిస్తోంది. ఇంతకీ హైదరాబాద్‌లో పైప్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ ఎలా పొందాలి... ఈ తరుణంలో సగటు మధ్యతరగతి యజమానికి వచ్చే ప్రధాన సందేహం ఒక్కటే.. "అసలు ఈ పైప్ గ్యాస్ కనెక్షన్ తీసుకోవడం వల్ల మనకేమైనా పైసా ఆదా అవుతుందా? లేక ఉన్న సిలిండరే బెటరా?" భాగ్యనగరంలో ఇప్పుడు అక్కడక్కడా రోడ్ల పక్కన పసుపు రంగు పైపులు కనిపిస్తున్నాయి. ఇళ్ల ముందర మీటర్లు బిగిస్తున్నారు. అవును.. నగరంలో పైప్‌డ్ నేచురల్ గ్యాస్ నెమ్మదిగా విస్తరిస్తోంది. హైదారాబాద్‌లో పీఎన్జీ కనెక్షన్లు పొందాలంటే ... ఉన్న ఒకే ఒక్క ఆప్షన్ భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్. ఇది గెయిల్ హెచ్‌పీసీఎల్ సంయుక్త సంస్థ.పైప్‌డ్ గ్యాస్ కనెక్షన్ పొందడానికి ముందు మనం చూసుకోవాలసింది. ఆ ప్రాంతంలో సహజవాయి పైప్‌లైన్లు ఉన్నాయా? లేదా..? అని.. మీ ప్రాంతంలో పైపులైన్ ఉన్నట్లైతే భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్‌లో అప్లై చేయాలి. కనెక్షన్ మొత్తానికి సరిపడా డిపాజిట్ చెల్లిస్తే..ఇన్‌స్టేషన్ పూర్తయ్యాక.. గ్యాస్ కనెక్షన్ యాక్టివ్ అవుతుంది. మీరు అపార్ట్‌మెంట్‌లో నివసించేట్లైతే.. దానికి ఆ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ పర్మిషన్ కావాలి.

# కొత్త నేతల కోసం పార్టీల ఎదురుచూపులు!

విజయవాడ, : ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకవైపు వైసీపీలో నాయకత్వాన్ని ప్రశంసించే వారు కొందరైతే, క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేసే వారు మరో వర్గంగా కనిపిస్తున్నారు. అదే పరిస్థితి టీడీపీ లో కూడా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురించి, మంత్రి నారా లోకేష్ గురించి ఎక్కువగా పొగిడే నాయకులు ఒకవైపు ఉంటే, నిశ్శబ్దంగా పని చేసే వారు మరోవైపు ఉన్నారుఇటీవల చంద్రబాబు నాయుడు కూడా ఈ విషయంపై స్పందిస్తూ, మాటలకంటే పని చేసే వారినే పార్టీ గుర్తిస్తుందని స్పష్టం చేశారు. మీడియా ముందువిమర్శలు చేయడం, ప్రత్యర్థి పార్టీలపై దాడి చేయడం ద్వారా మైలేజ్ పొందే ప్రయత్నాలను ఆయన తప్పుపట్టారు. ఇదే సమయంలో వైసీపీ)లో ఇలాంటి మందలింపులు బయటకు రావడం లేదు అనే అభిప్రాయం వినిపిస్తోంది. ఇక దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన అంశం కూడా ఇప్పుడు కీలకంగా మారింది. దాదాపు 50 శాతం వరకు నియోజకవర్గాలు పెరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా సుమారు 88 అసెంబ్లీ స్థానాలు, 12 పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. ఈ మార్పుల నేపథ్యంలో పార్టీలకు కొత్త నాయకుల అవసరం తప్పనిసరిగా మారింది.అయితే ఇక్కడే అసలు సమస్య కనిపిస్తోంది. బాగా చదువుకున్న నాయకులను ఎంపిక చేయాలని అనుకుంటే, అలాంటి వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. మరోవైపు సాధారణ స్థాయి నాయకులు ఉన్నా, వారిలో సామర్థ్యం ఎంత అనే ప్రశ్న ముందుకు వస్తోంది. కేవలం పొగడ్తలు చెప్పే వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని విశ్లేషకులు భావి స్తున్నారు. క్షేత్రస్థాయిలో జెండా మోస్తూ పని చేసే కార్యకర్తలకు అవకాశాలు ఇవ్వాలనే ఆలోచన కూడా ఉంది. కానీ అక్కడ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చే సిఫారసులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కారణంగా సరైన వ్యక్తిని ఎంపిక చేయడం పార్టీలకు సవాల్‌గా మారింది. ప్రతి నియోజకవర్గంలో పరిస్థితులు ఒకేలా లేకపోవడం కూడా సమస్యను పెంచుతోంది.కొన్ని జిల్లాల్లో నాయకుల సంఖ్య ఎక్కువగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో సరైన నాయకత్వం కొరతగా ఉంది. ఈ అసమతుల్యత కారణంగా పార్టీలకు నిర్ణయాలు తీసుకోవడం కష్టం అవుతోంది. భవిష్యత్తులో బలమైన నాయకత్వం అవసరం పెరుగుతుందని స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే, రాజకీయ పార్టీలకు ప్రస్తుతం నాయకుల ఎంపిక ఒక కీలక పరీక్షగా మారింది. సరైన వ్యక్తులను గుర్తించి అవకాశాలు ఇవ్వడం ద్వారా మాత్రమే భవిష్యత్తులో విజయాన్ని సాధించగలవు. ఇంకా రెండు సంవత్సరాల సమయం ఉన్న నేపథ్యంలో, నాయకులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం ఉంది. అదే సమయంలో పార్టీలు కూడా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# మాటలు సరే... చేతలు ఎక్కడా?

కడప, : జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో 2024 ఎన్నికల ఓటమి ఒక పెద్ద కుదుపు. అయితే, ఓటమి తర్వాత ఆయన కేడర్‌లో ధైర్యం నింపడానికి, ప్రజల్లోకి వస్తానని పదేపదే చేస్తున్న ప్రకటనలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రేపు మాపు అంటూ కాలం గడుపుతున్న తీరుపై సొంత పార్టీలోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు వైఎస్ జగన్ చేసిన ప్రకటనలను గమనిస్తే, ఆయన యాక్షన్ ప్లాన్ కేవలం ప్రకటనలకే పరిమితమైందని స్పష్టమవుతోంది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారి పార్టీ నేతలతో మాట్లాడిన జగన్, "ప్రజల పక్షాన పోరాడతాం, త్వరలోనే జిల్లాల పర్యటనలు చేపడతాను" అని ప్రకటించారు. కానీ ఆ తర్వాత ఆయన పర్యటనలు కేవలం బెంగళూరు ప్యాలెస్‌కు, తాడేపల్లి క్యాంప్ ఆఫీసుకే పరిమితమయ్యాయి. అక్టోబర్ 2024 నుంచి జిల్లాల బాట పడతానని కేడర్ ను కలుస్తానని చెప్పారు. కానీ ఆ దసరా కూడా దాటిపోయింది.దసరా అనంతరం మీడియా ముందుకొచ్చిన జగన్, సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటనలు చేస్తానన్నారు. నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతానన్నారు. వారంలో రెండ్రోజులు పాటు జిల్లాల్లోనే ఉంటానన్నారు. అది కూడా దాటిపోయింది. 2025 ఉగాది తర్వాత క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయని, బస్సు యాత్ర చేసే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. కానీ అది కూడా దాటిపోయింది. ఇప్పటికే ఏడాది అయింది. కానీ ఆయన జనంలోకి మాత్రం రాలేదు.ఇప్పుడేమో వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని జగన్ చెప్తున్నారు. అంతేకాదు.. పాదయాత్రలో చంద్రబాబుకు సినిమా చూపిస్తానంటున్నారు. ఇలాంటి ప్రకటనలు కేడర్ లో తాత్కాలిక ఉత్సాహం నింపుతున్నాయి కానీ, ఇలాంటి వాటి వల్ల పార్టీకి కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు. గతంలో ఆయన ఇచ్చిన స్టేట్ మెంట్లలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. దీంతో ఇప్పుడు పాదయాత్ర కూడా స్టేట్ మెంట్ కు పరిమితమైపోయే అవకాశం ఉందనే ఊహాగానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి.ఇదిగో వచ్చేస్తున్నా, అదిగో వచ్చేస్తున్నా అని చెప్పిన మరుసటి రోజే జగన్ బెంగళూరు వెళ్లిపోతున్నారు. దీంతో కేడర్ కి ఇలాంటి స్టెంట్ మెంట్స్ వినడం అలవాటైపోయింది. వాళ్లు కూడా పెద్దగా పట్టించుకోవడం మానేస్తున్నారు. ఈ సారైనా చెప్పిన మాట మీద నిలబడితే బాగుంటుందని కేడర్ కోరుకుంటోంది. జగనన్న మాట తప్పడు, మడమ తిప్పడు అని కేడర్ చెప్పుకుంటూ ఉంటుంది. కానీ ఇప్పుడు ఆయన చేతలు స్టేట్ మెంట్స్ కే పరిమితం అవుతుండడంతో కేడర్ లోనే అనుమానాలు మొదలవుతున్నాయి.

# హెచ్-1 వీసాలపై కక్ష సాధింపు ధోరణి




### అధికాంలోకి వచ్చిన ఏడాదిగా బెదిరింపులు
### ట్రంప్ తీరుపై ఇంటాబయటా విమర్శలు

న్యూఢిల్లీ: వీసా కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. భారత విదేశా ంగశాఖ అమెరికాతో సంప్రదింపులు జరిపినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి తెలిపారు. అయితే ఇదంతా కేవలం భారత్ పట్ల ట్రంప్ అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిగానే గుర్తించాలి. ప్రజలు ఇబ్బంది పడుతున్నా, టెక్ కంపెనీలు సూచించినా ట్రంప్ వైఖరిలో మార్పు రాలేదు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత భారత్‌కు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకు ఆయన తీసుకున్న నిర్ణయాలు అన్ని రకాలుగా భారత్‌ను కష్టాల్లో పడేశాయి. హెచ్ 1 బీ వీసాల ఫీజు భారీగా పెంచేశారు. హెచ్ 1బీ వీసా ఫీజులను ఏడాదికి1,00,000 డాలర్ల వరకు పెంచారు. హెచ్ 1బీ వీసాల రుసుము పెంచిన కొన్ని రోజులకు మరో దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. విదేశీ చిత్రాలపై ఏకంగా 100 శాతం టారీఫ్‌లు విధించారు. అమెరికాలో భారతీయ సినిమాలకు మంచి ఆదరణ ఉంటుంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంతో భారత చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడింది. ఇంతటితో ట్రంప్ కక్ష సాధింపు చర్యలు ఆగలేదు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే బియ్యంపై 50 శాతం టారీఫ్‌లు విధించారు. ఒకరకంగా చెప్పాలంటే 2025లో భారత్, అమెరికాల మధ్య సంబంధం టారీఫ్‌ల వివాదంతోటే గడిచిపోయింది. అవకాశం ఉన్న ప్రతీ దానిపై ట్రంప్ టారీఫ్‌లు వేసేశారు. తమ దేశంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కోపంతో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కారణంతో ఆగస్టు నెలలో భారత్‌పై ఏకంగా 50 శాతం టారీఫ్‌లు వేశారు. రెండు దేశాల మధ్య చర్చలు జరిగినా ఫలితం లేకుండా పోయింది. రష్యాతో ఇండియా ఆయిల్ కొనుగోలు చేయటం ఇష్టం లేని ట్రంప్ బెదిరింపులకు దిగారు. రష్యాతో వ్యాపారం మానుకోకపోతే మరిన్ని టారీఫ్‌లు వేస్తామని హెచ్చరిరరు. ఇలాంటి సమయంలో గత ఆగస్టు నెలలో ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లారు. అక్కడ మోదీ, పుతిన్, జిన్ పింగ్ కలిశారు. పలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ముగ్గురూ కలవటంపై ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో సెప్టెంబర్ 5వ తేదీన క్రిప్టిక్ మెసేజ్ పెట్టారు. డిసెంబర్ 8వ తేదీన అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో మాట్లాడుతూ అమెరికాలోని రైతులకోసం మల్టీ బిలియన్ డాలర్ రిలీఫ్ ప్యాకేజ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా భారత్, ఇతర ఆసియా దేశాలనుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై విమర్శలు సైతం గుప్పించారు. ఇతర దేశాలనుంచి వస్తువుల్ని అమెరికాలోకి దిగుమతి చేసుకోవటం స్థానిక ఉత్పత్తిదారులకు సవాలుగా మారిందని అన్నారు. స్థానిక ఉత్పత్తిదారులను రక్షించటం కోసం, దిగుమతులకు అడ్డుకట్ట వేయటం కోసం భారీ మొత్తంలో టారిఫ్‌లు వేస్తామని స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'రైతులు ఎంతో అవసరమైన జాతీయ ఆస్థి. అమెరికాకు వెన్నెముక లాంటి వారని అన్నారు. రష్యా, చైనాలను తమ దారిలోకి తెచ్చుకోవడానికి భారత్‌ను అమెరికా పావుగా వాడుకుంటోందని అమెరికాకు చెందిన రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ తీసుకునే నిర్ణయాలవల్ల అమెరికాకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే సంబంధాలు మరింత దారుణంగా దెబ్బతింటాయని హెచ్చరిస్తున్నారు. అయితే, రెండు దేశాల మధ్య భవిష్యత్ వాషింగ్టన్, ఢిల్లీ తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. 2026లో అయినా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని అమెరికన్లు కూడా ఆశగా ఉన్నారు. ముఖ్యంగా వీసా వ్యవహారాలపై సరైన నిర్యం తీసుకోకుంటే తక్షణ ఇబ్బందులు తప్పేలా లేవు.

## స్త్రీ నిధి పేరుతో యాప్

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మరింత వేగంగా, సులభతరంగా సేవలు అందించేందుకు టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకుంటోంది. ప్రజలు తమ మొబైల్ నుంచే అన్నీ సేవలు పొందేలా డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తుంది. ఇటీవల మీ సేవకు వెళ్లాల్సిన అసవరం లేకుండా మీ సేవ యాప్‌ను తీసుకురాగా.. దీని ద్వారానే ప్రజలు ఇన్ కమ్, కులం, రెసిడెన్షియల్ సర్టిఫికేట్ లాంటివి పొందవచ్చు. ఇక రేషన్ కార్డు వివరాలు, డీలర్ వద్ద ఎంత స్టాక్ ఉందనేది తెలుసుకునేందుకు ఇటీవల టీ రేషన్ యాప్ ప్రారంభించింది. అలాగే రైతుల కోసం కొద్దిరోజుల క్రితం యూరియా బుక్ చేసుకునేందుకు యాప్ లాంచ్ చేయగా.. తాజాగా మహిళలకు ఉపయోగపడేలా కొత్త యాప్ తెచ్చింది.మహిళా పొదుపు సంఘాలకు ఆర్థికంగా తొడ్పాటు అందించేందుకు ప్రభుత్వం స్త్రీ నిధి పేరుతో రుణాలు మంజూరు చేస్తోన్న విషయం తెలిసిదే. ఈ రుణాలను సులువుగా పొందేలా మన స్త్రీనిధి పేరుతో యాప్ తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా ఇంటి నుంచే మహిళలు లోన్ కోసం అప్లై చేసుకోవచ్చు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అసవరం లేదు. ఇప్పటికే రుణం తీసుకున్నవారే కాకుండా కొత్తగా లోన్ తీసుకోవాలనుకునేవారు ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మహిళలు తాము నెలనెలా చెల్లించే వాయిదాల సొమ్మును ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కొంతమంది తమ సభ్యులకు తెలియకుండా నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. ఇప్పుడు ప్రతీ మహిళ తాము చెల్లించిన డబ్బులు అకౌంట్లో పడ్డాయా లేదా అనేది చెక్ చేసుకోవచ్చు. ఒకవేళ డబ్బులు జమ కాకపోతే అధికారులను వెంటనే సంప్రదించవచ్చు. అలాగే గతంలో చెల్లించిన సొమ్మును బట్టి ఎంత రుణం వస్తుంది.. ?రుణం పొందిన తర్వాత స్టేటస్ ఏంటి..? ఎవరి దగ్గర పెండింగ్ ఉంది..? అనే అన్నీ వివరాలను స్త్రీ నిధి యాప్ ద్వారా తెలుసుకునే అవకాశముంది.డౌన్‌లోడ్ ఎలా చేసుకోవాలంటే..? గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి మన స్త్రీనిధి అని సెర్చ్ చేయండి, మీ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోండి. –ఫోన్ నెంబర్ టైప్ చేసి రిజిస్టర్ అవ్వండి. మీ సంఘం వివరాలు, లోన్ల వివరాలు చెక్ చేసుకోండి



# బత్తాయి పండ్లను లైట్ తీసుకోకండి..

## ఇవి మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు..

బత్తాయి పండ్లు.. చూసేందుకు అచ్చం నారింజ పండ్లలాగే ఉంటాయి. కానీ నారింజ పండ్లంత తియ్యగా ఉండవు. మరీ పుల్లగా కూడా ఉండవు. కానీ ఇవి రుచిగా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. చాలా మంది రహదారుల పక్కన ఉండే జ్యూస్ సెంటర్లలో బత్తాయి రసం తాగేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఈ పండ్లు కాస్త తీపి, పులుపు రుచి కలిగి ఉంటాయి. చూసేందుకు పెద్ద నిమ్మ పండు సైజులో ఉంటాయి. బత్తాయి పండ్లనే స్వీట్ లైమ్ అని కూడా పిలుస్తారు. ఈ పండ్ల గుజ్జు లేత పసుపు రంగులో ఉంటుంది. బత్తాయి పండ్లను చాలా మంది నేరుగా తింటారు. కానీ ఈ పండ్లను జ్యూస్‌గా తాగితేనే చాలా బాగుంటుంది. బత్తాయి పండ్ల రసాన్ని చాలా మంది ఇష్టంగా తాగుతారు. బత్తాయి పండ్లను తింటున్నా లేదా జ్యూస్‌ను తాగుతున్నా అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

నోటి దుర్వాసనకు చెక్..: బత్తాయి పండ్లలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. జలుబు, జ్వరం వచ్చినప్పుడు రోజుకు 2 సార్లు ఈ పండ్ల జ్యూస్‌ను తాగాలి. దీంతో త్వరగా కోలుకుంటారు. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. శరీరం కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. నీరసం, అలసట తగ్గుతాయి. చురుగ్గా మారుతారు. బత్తాయి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది దంతాలు, చిగుళ్లను దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గిపోతుంది. బత్తాయి పండ్లను తింటే నోట్లో లాలాజలం అధికంగా స్రవించబడుతుంది. ఇది మనం తిన్న ఆహారాన్ని సులభంగా, త్వరగా జీర్ణం చేస్తుంది. దీంతో అజీర్తి, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు.

మలబద్దకం ఉండదు..: బత్తాయి పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ పండ్లను తింటే మలబద్దకం తగ్గుతుంది. రోజూ ఉదయం సుఖ విరేచనం అవుతుంది. బత్తాయి పండ్లలో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి జీర్ణ రసాలు, ఆమ్లాలు విడుదల అయ్యేందుకు సహాయం చేస్తాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. ఏదైనా వ్యాధి వచ్చిన వారు బత్తాయి పండ్ల రసాన్ని సేవిస్తుంటే త్వరగా శక్తి లభించి రోగం నుంచి త్వరగా కోలుకుంటారు. ఉదయం జాగింగ్ లేదా వాకింగ్, యోగా, వ్యాయామం చేసిన అనంతరం ఒక గ్లాస్ బత్తాయి పండ్ల రసం సేవిస్తే శరీరానికి వెంటనే శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. రోజంతటికీ కావల్సిన శక్తి లభిస్తుంది. ఎంత పనిచేసినా నీరసం, అలసట రావు. బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా టీ, కాఫీ వంటివి తాగకుండా బత్తాయి పండ్ల రసం తాగితే ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

విరేచనాల నుంచి ఉపశమనం..: బత్తాయి పండ్లలో ఉండే ఆమ్లాలు జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లను బయటకు పంపుతాయి. దీంతో జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. అజీర్తితో బాధపడేవారికి బత్తాయి రసం ఔషధంగా పనిచేస్తుంది. బత్తాయి పండ్లలో ఉండే పొటాషియం విరేచనాలను తగ్గిస్తుంది. బాధితులు త్వరగా కోలుకునేలా చేస్తుంది. కామెర్లు వచ్చిన వారు ఈ పండ్ల రసం తాగుతుంటే త్వరగా కోలుకుంటారు. వాంతులు, తలతిరగడం వంటి సమస్యలు ఉన్నవారు బత్తాయి పండ్ల రసం తాగితే మంచిది. గొంతు సంబంధ ఇన్‌ఫెక్షన్లు ఉన్నవారు బత్తాయి రసం తాగితే త్వరగా ఉపశమనం లభిస్తుంది. రోజూ ఈ జ్యూస్‌ను సేవించడం వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. బ్లడ్ క్లాట్స్ కరిగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఇలా బత్తాయి పండ్లు మనకు చేసే మేలు అంతా ఇంతా కాదు. కనుక ఇవి కనబడితే విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి.

# పొట్టను పట్టించుకుందాం



మన శరీరాలకు పోషణ మనం తినే ఆహారం నుంచే లభిస్తుంది. శరీరం బాగుండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. దురదృష్టవశాత్తూ ఇప్పుడు చాలామంది జంక్ ఫుడ్, రిఫైన్డ్ పిండి, చక్కెరలు, ఉప్పు, రసాయనాలు, ప్రిజర్వేటివ్‌లు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకుంటున్నారు. ఇలాంటి ఆహారాలు జీర్ణ సమస్యలతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలకు బాటలు వేస్తాయి. అంతేకాదు మసాలా, వేపుడు ఆహారాలు కూడా పొట్టలో అసౌకర్యం కలుగజేస్తాయి. కాబట్టి, పొట్టకు మేలు చేసే ఆహారాన్ని మన భోజనంలో భాగం చేసుకోవాలి.

యోగర్ట్: పొట్ట ఆరోగ్యానికి యోగర్ట్ మంచి ఆహారం. రోజూ యోగర్ట్ తీసుకోవడంవల్ల జీర్ణ సమస్యలనుఅధిగమించవచ్చు. ఉదయం వేళలో, మధ్యాహ్నం భోజన సమయంలో యోగర్ట్ తీసుకోవడం మంచిది.

హోల్ గ్రెయిన్స్: ముతక ధాన్యాలు (హోల్‌గ్రెయిన్స్) పొట్టకు మేలుచేసేవిగా పరిగణిస్తారు. గోధుమలు, ఓట్స్, బియ్యం, ఇతర హోల్‌గ్రేన్స్ నుంచి ఆహారం తీసుకోవాలి. ఇవి పొట్టకు మంచివి. వీటిలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది.

అరటిపండు: బాగా మాగిన అరటిపండు పొట్టకు ఎంతో మేలుచేస్తుంది. ఇందులో పొటాషియం ఉంటుంది. అరటిపండు తినడం వల్ల అరుగుదల మెరుగుపడుతుంది.

ఎన్నో పొట్ట సమస్యలు కూడా పారిపోతాయి. అరటిపండు తినడం పొట్టకు సంబంధించిన గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సమస్యలను తగ్గిస్తుంది. బొప్పడిపండు: బొప్పడిపండు అరుగుదలకు సహాయకారిగా ఉంటుంది. పొట్టను శుభ్రం చేసే పోషకాలకు ఇది గని. అలా బొప్పడిపండు మలబద్ధకాన్ని నివారిస్తుంది. అరుగుదల మొదలుకుని గుండెలో మంట, అజీర్తి తదితర సమస్యలను దూరం చేస్తుంది. అల్లం: అల్లాన్ని పొట్టకు మేలుచేసేదిగా పరిగణిస్తారు. వికారం, కడుపునొప్పితో బాధపడుతున్నవాళ్లకు అల్లం మంచిది. రోజువారీ గా భోజనంలో ఏదో విధంగా అల్లాన్ని చేర్చుకోవడం మంచిది.

# నల్ల జీలకర్రలో అనేక లాభాలు..!



జీలకర్రను మనం ఎప్పటి నుంచో వంట ఇంటి పోపు దినుసుగా ఉపయోగిస్తున్నాం. జీలకర్రను నిత్యం అనేక వంటల్లో వేస్తుంటారు. జీలకర్రను కూరల్లో వేస్తే కూరలు చక్కని వాసన వస్తాయి. రుచిగా కూడా ఉంటాయి. అయితే జీలకర్రలో మరో రకం జీలకర్ర కూడా ఉంటుంది. అదే నల్ల జీలకర్ర. దీన్ని చాలా మంది చూసి ఉండరు. కానీ నల్ల జీలకర్రను కూడా మనం ఉపయోగించవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. నల్ల జీలకర్రను ఒక టీస్పూన్ మోతాదు లో తీసుకుని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజుకు ఒక కప్పు మోతాదులో ఉదయం తాగుతుండాలి. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. నల్ల జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ వీటిల్లో సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తుంది. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. కీళ్ల నొప్పులు, వాపులకు..: నల్ల జీలకర్రలో అధికంగా ఉండే థైమోక్వినోన్ అనే యాంటీ ఆక్సిడెంట్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. అందువల్ల ఈ జీలకర్రను వేసి మరిగించిన నీళ్లను రోజూ సేవిస్తుంటే కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతా యి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. నల్ల జీలకర్రలో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. అంటే దీన్ని తీసుకుంటే రోగ నిరోధక వ్యవస్థ బలంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది.

# వేప పండ్ల గురించి ఈ నిజాలు తెలుసా..?

### ప్రకృతి మనకు అందించిన ఆరోగ్య ప్రదాయిని ఇవి..!

వేప చెట్టు లేని ఊరిలో అసలు ఉండకూడదు.. అని మన పూర్వీకులు చెబుతుండేవారు. ఎందుకంటే ఆయుర్వేద ప్రకారం వేప అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఈ చెట్టులోని ప్రతి భాగం మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకనే మన పెద్దలు వేప చెట్టు గురించి అంత గొప్పగా చెబుతుండేవారు. వేప చెట్టుకు చెందిన ఆకులు, బెరడు, పువ్వులు.. ఇలా అన్నీ ఉపయోగకరమే. అలాగే వేప పండ్లు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. వేప పండ్ల నుంచి నూనెను తీసి ఉపయోగిస్తుంటారు. వేప పండ్లను కొందరు ఎండబెట్టి డ్రై ఫ్రూట్స్ రూపంలో తింటారు. వే పండ్లను నేరుగా తింటే చేదుగా ఉంటాయి. కనుక వాటిని ఎండ బెట్టి తినవచ్చు. వేప పండ్లను తినడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది.

నులి పురుగుల సమస్యకు..: వేప పండ్లలో యాంటీ వార్మ్ గుణాలు ఉంటాయి. అంటే పొట్టలో నులి పురుగులు ఉన్నవారు ఈ పండ్లను తింటే ఆ పురుగులు నశిస్తాయి. వేప పండ్లలో ఉండే సమ్మేళనాలు పొట్టలో ఉండే పురుగులను చంపేస్తాయి. దీంతో నులి పురుగుల సమస్య నుంచి బయట పడవచ్చు. పెద్దలకే కాదు ఈ చిట్కా పిల్లలకు కూడా మేలు చేస్తుంది. వేప పండ్లలో యాంటీ మలేరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తీసుకుంటే మలేరియా నుంచి త్వరగా కోలుకుంటారు. ఈ పండ్లలో ఉండే సమ్మేళనాలు మలేరియాకు కారణం అయ్యే క్రిములను చంపేస్తాయి. దీంతో జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. వేప పండ్లలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటుంటే నొప్పులు, వాపులు తగ్గుతాయి. ముఖ్యంగా కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

చర్మ సమస్యలకు..: వేప పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలపై పడే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలు సురక్షితంగా



ఉంటాయి.క్యాన్సర్, గుండె జబ్బులవంటి ప్రాణాంతకవ్యాధులు రాకుం డా అడ్డుకోవచ్చు. వేప పండ్ల గుజ్జును రాస్తుంటే ఎలాంటి చర్మ సమస్యలు అయినా ఇట్టే తగ్గిపోతాయి. గజ్జి, తామరతోపాటు చర్మంపై వచ్చే దురదలు, దద్దుర్లు తగ్గిపోతాయి. వేప పండ్లలో యాంటీ సెప్టిక్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మ సమస్యలను తగ్గిస్తాయి. వేప పండ్లు అందుబాటులో లేకపోతే వాటి నుంచి తీసిన నూనెను కూడా చర్మ సమస్యలను తగ్గించేందుకు ఉపయోగించవచ్చు. జీర్ణ వ్యవస్థకు..: వేప పండ్లను తింటుంటే జీర్ణ వ్యవస్థకు ఎంతగానో మేలు జరుగుతుంది. జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. మలబద్దకం నుంచి బయటపడతారు. గ్యాస్,అసిడిటీ, కడుపుఉబ్బరం వంటి జీర్ణ సమస్యలు తగ్గుతాయి. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. శరీరం శుభ్రంగా మారుతుంది. రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు వేప పండ్లలో ఉన్నాయని ఆయుర్వేదం చెబుతోంది. వేప పండ్లను రోజూ తింటుంటే రక్తంశుద్ధి అవుతుంది.దీంతో రక్త సంబంధ వ్యాధుల నుంచి బయట పడవచ్చు. వేప పండ్లలో సహజసిద్ధమైన ఇన్‌సెక్టిసైడల్ గుణాలు ఉంటాయి. అంటే ఈ పండ్ల ద్వారా పురుగులు, క్రిమి కీటకాలను నాశనం చేయవచ్చు. ముఖ్యంగా వ్యవసాయం చేసేవారికి ఈ పండ్లు సహజసిద్ధమైన ఎరువుగా, పోషక పదార్థంగా ఉపయోగ పడతాయి. దీంతో పంటను నాశనం చేసే పురుగులు, క్రిమికీటకాలు నశిస్తాయి. అలాగే పంటకు పోషణ లభించి దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఇలా వేప పండ్లతో అనేక లాభాలను పొందవచ్చు.

# మన చుట్టూ పరిసరాల్లోనే కనిపించే పువ్వులు ఇవి..



చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా నీలి రంగులో ఉండే ఈ పువ్వులను మీరు గమనించారా..? ఇవి మన చుట్టూ పరిసరాల్లోనే కనిపిస్తుంటాయి. శంఖపుష్పి అనే తీగ జాతికి చెందిన మొక్కకు ఈ పువ్వులు పూస్తాయి. ఈ పువ్వులు తెలుపు లేదా నీలి రంగులో ఉంటాయి. అయినప్పటికీ నీలి రంగు పువ్వులతోనే మనకు ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. ఆయుర్వేదంలో పలు రకాల ఔషధాలను తయారు చేయడంతోపాటు పలు వ్యాధులను నయం చేసేందుకు శంఖపుష్పి మొక్కను ఉపయోగిస్తుంటారు. ఈ మొక్కకు చెందిన తీగ, వేర్లు, ఆకులు కూడా ఉపయోగకరమే. అయితే సాధారణంగా ఈ మొక్కకు పూసే నీలి రంగు పువ్వులనే అధికంగా ఉపయోగిస్తుంటారు. ఈ పువ్వుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి.

మెదడుకు టానిక్..: శంఖపుష్పి పువ్వులను వాడడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఏకాగ్రతగా పనిచేస్తారు. ఏదైనా అంశంపై ఎక్కువగా దృష్టి పెట్టగలుగుతారు. దీంతో ఆలోచనా శక్తి పెరుగుతుంది. పనిచేసే విషయాల్లో రాణిస్తారు. తెలివి తేటలు పెరుగుతాయి. మెదడు వికాసం చెంది యాక్టివ్‌గా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. బద్దకం పోతుంది.


### విడిచిపెట్టకుండా తెచ్చి వాడండి.. ఎందుకంటే..?

ఎల్లప్పుడూ ఉత్సాహంగా కనిపిస్తారు. మానసిక శక్తి పెరుగుతుంది. మానసికంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉంటారు. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. డిప్రెషన్‌తో బాధపడుతున్నవారికి ఈ పువ్వులు చక్కని ఔధషంలా పనిచేస్తాయి. మానసికంగా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారు. శంఖపుష్పి మెదడుకు టానిక్‌లా పనిచేస్తుంది. మెదడు కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్యంలో మతిమరుపు రాకుండా చూసుకోవచ్చు.

గాఢ నిద్ర కోసం..: శంఖపుష్పి పువ్వులను వాడితే ఒత్తిడి, ఆందోళన తగ్గి మైండ్ రిలాక్స్ అవుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. రాత్రి పూట పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. మరుసటి రోజు ఉదయం ఉత్సాహంగా నిద్ర లేస్తారు. ఈ పువ్వుల్లో బయో యాక్టివ్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. శంఖపుష్పి పువ్వుల్లో హైపో లిపిడెమిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పువ్వులను వాడితే శరీరంలోని కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

ఎలా వాడాలి..?: శంఖపుష్పి పువ్వుల్లో ఇమ్యునో మాడ్యులేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడేలా చేస్తాయి. శంఖపుష్పిని వాడడం వల్ల జీర్ణ శక్తి మెరుగు పడుతుంది. మలబద్దకం తగ్గుతుంది. ఇలా ఈ పువ్వులతో అనేక లాభాలను పొందవచ్చు. అయితే ఈ పువ్వులను ఎలా వాడాలంటే.. నాలుగైదు శంఖపుష్పి పువ్వులను తీసుకుని నీటిలో వేసి మరిగించి అనంతరం వడకట్టాలి. ఈ నీళ్లు గోరు వెచ్చగా ఉండగానే అందులో కాస్త నిమ్మరసం, తేనె కలిపి తాగేయాలి. ఈ విధంగా శంఖపుష్పి పువ్వులను వాడుతుంటే ఎన్నో అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చు.

# గౌట్‌కు మందు కాకరకాయ



ప్రస్తుతం మనదేశంలో చాలామంది యూరిక్ ఆమ్లం సమస్యతో బాధపడుతున్నారు. మన శరీరంలో ప్యూరిన్ అనే మూలకం విచ్ఛిన్నం వల్ల యూరిక్ ఆమ్లం తయారవుతుంది. ఇది రక్తం ద్వారా కిడ్నీలకు చేరుతుంది. మూత్రం ద్వారా బయటికి వెళ్లిపోతుంది. అయితే, యూరిక్ ఆమ్లం మూత్రంలో బయటికి వెళ్లనప్పుడు శరీరంలో దాని పరిమాణం పెరుగుతూ వస్తుంది. దీనివల్ల కీళ్లనొప్పులు వస్తాయి. లేవడం, కూర్చోవడం కష్టమైపోతుంది. దీన్నే గౌట్ అని పిలుస్తారు. యూరిక్ ఆమ్లం పేరుకోవడం వల్ల గుండెజబ్బులు, అధిక రక్తపోటు, కిడ్నీలో రాళ్లు, ఆర్థరైటిస్ లాంటి సమస్యలూ తలెత్తుతాయి. కాబట్టి, దీన్ని సరైన సమయంలో గుర్తించి అదుపులో పెట్టుకోవాలి. ఈ దిశగా కాకరకాయ జ్యూస్ మంచి ఔషధంగా పనిచేస్తుంది. ఆహార విధానంలో ఏవైనా మార్పులు చేసుకోవడానికి ముందు వైద్యుల సలహా తప్పనిసరి.

కాకరకాయ జ్యూస్ ప్రయోజనాలు ఏంటో చూద్దాం

యూరిక్ ఆమ్లం తగ్గింపులో కాకరలో ఔషధ గుణాలు అపారం. ఓ గ్లాసెడు కాకరకాయ రసం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో యూరిక్ ఆమ్లం స్థాయులు సహజంగానే తగ్గిపోతాయి. కాకరలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ సి, కాల్షియం, బీటా కెరాటిన్ లాంటివి సమృద్ధిగా ఉంటాయి. ఇవి గౌట్ నివారణలో దోహదపడతాయి.

మధుమేహానికి మందుగా: మధుమేహం నియంత్రణలో కూడా కాకరకాయ ఎంతో ప్రయోజనకారి. విటమిన్ ఎ, సి, బీటా కెరాటిన్, ఇతర మినరల్స్, ఫైబర్ వల్ల ఇది ఇన్సులిన్‌లా పనిచేస్తుంది. రక్తంలో పెరిగే చక్కెర స్థాయుల నిర్వహణలో గొప్పగా ఉపయోగపడుతుంది.

ఎలా తీసుకోవాలి?: ప్రతిరోజూ పొద్దునే పరగడుపున ఓ సగం కప్పు కాకరకాయ జ్యూస్ తీసుకోవాలి. దీనికి సైంధవ లవణం, లేదంటే నిమ్మరసం కలుపుకొంటే చేదు తగ్గుతుంది. గౌట్, ఆర్థరైటిస్ సమస్యల విషయంలో కాకరకాయ జ్యూస్ మేలుచేస్తుంది. జ్యూస్ ఒక్కటి మాత్రమే కాకుండా, కాకరకాయతో రకరకాల కూరలు చేసుకుని తినడమూ మంచిదే. కాకరకాయ పొడి కూడా తీసుకోవచ్చు. దీనికోసం కాకరకాయను బాగా కడగాలి. ఆ తర్వాత దాన్ని ముక్కలుగా చేసి, నీడలో ఆరబెట్టాలి. ఆ తర్వాత వాటిని నూరి పొడిగా చేసుకోవాలి. ఈ పొడిని రోజూ పొద్దునే సగం టీస్పూన్ గానీ, టీస్పూన్ గానీ నీళ్లతో కలుపుకొని సేవించాలి.


# సుస్వర మంగళ




యాసిడ్ మంటల్లో.. ఆమె అందమైన ముఖం కాలిపోయింది. లేలేత చెక్కిళ్లను, కోటేరు లాంటి ముక్కు, పదాలు పలికే పెదాలను యాసిడ్ కాల్చివేసింది. ఆ దాడి ఆమె అందమైన రూపాన్నేకాదు ఆనందమయ జీవితాన్నీ అంధకారం చేసింది. స్నేహితుల సూటిపోటి మాటలకు బడికి దూరమైంది. కానీ, చదువుకు దూరం కాలేదు. యాసిడ్ తన రూపాన్ని కాల్చి వేసినా గొంతును తాకలేకపోయింది. ఆ గాత్రాన్ని ఆధారంగా చేసుకొని తన జీవితాన్ని సుస్వర భరితం చేసుకుంది. హిందుస్థానీ సంగీతంలో అనన్య సామాన్యమైన ప్రతిభ చాటింది. 'కాశీ కీ లత'గా గుర్తింపు పొందిన మంగళా కపూర్ జీవిత గాథ వెండితెరకెక్కింది. పార్లమెంట్ గౌరవాన్ని, పద్మశ్రీ పురస్కారాన్ని గెలుచుకున్న మంగళ స్వరరాగ గంగా ప్రవాహమిది! తన ఈడు పిల్లల్లాగే మంగళ ఆడుతూ, పాడుతూ ఉండేది. తనకు వారణాసి ఇరుకు వీధులు, పెద్దపెద్ద ఆలయాలు, గంగా నది తప్ప మరో ప్రపంచం తెలియదు. వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధిగాంచిన బెనారస్‌లో మంగళ వాళ్ల నాన్న వస్త్ర వ్యాపారం చేస్తుండేవాడు. ఆ వ్యాపార గొడవల్లో ఓ రోజు అర్ధరాత్రి పూట ఒక ముఠా వాళ్ల ఇంటిపై దాడి చేసింది. ఏం జరిగిందో అర్థమయ్యేలోపే.. క్షణాల్లో ఆమె ముఖం కాలిపోయింది. ఆ తర్వాత తెల్లవారింది కానీ, మంగళ జీవితంలోకి వెలుగు రాలేదు. అది యాసిడ్ దాడి అని కొన్ని రోజులకు ఆమెకు తెలిసింది. 1965లో జరిగిన ఈ ఘటనలో గాయపడిన మంగళ మనదేశంలో తొలి యాసిడ్ దాడి బాధితురాలిగా మిగిలింది. దవాఖానలో కొంతకాలం చికిత్స పొందిన మంగళ మృత్యుముఖం నుంచి బయటపడింది. మళ్లీ ఇంటి గడప తొక్కింది. కానీ, నిన్నటి నవ్వులు లేవు. ఆనందాలు లేవు. ఉన్నదల్లా దుఃఖమే. అయినా సరే, బతకాలి. బతకడం కోసం గెలవాలి. గెలవడం కోసం బతకాలని తండ్రి ఆమెకు ఆశలు కల్పించాడు. బుగ్గలు, చెవులు, మెడ, ఛాతీపై యాసిడ్ చేసిన గాయాలకు సర్జరీలు చేశారు. 37 శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చింది. దీనికి ఆపరేషన్ థియేటర్‌లో ఘోరమైన హింసను భరించి కొత్త రూపు కోసం ఆరేండ్లు నరకం అనుభవించింది. పూర్వపు అందం రాకపోయినా సాధారణ పనులకు దేహం సహకరిస్తే చాలనుకుంది. మంగళకు చదువంటే ప్రాణం. బడికి వెళ్తే తనను చూసి పిల్లలు దూరంగా జరిగేవాళ్లు. కొంతమంది భయపడేవాళ్లు. ఇంకొంతమంది ముక్కులేదని దెప్పి పొడిచేవాళ్లు. యాసిడ్ గాయల కంటే సానుభూతి లేని సాటి మనుషుల మాటలే ఆమె మనసుని మరింతగా బాధించాయి. కాకుల్లా పొడిచే మనుషుల మధ్య సంతోషంగా ఉండలేక ఆమె ఇంటికే పరిమితమైపోయింది. బయటికి పోతే భయంతో దూరంగా జరిగిపోయే జనం. బడికి వెళ్తే ఎగతాళి చేసే స్నేహితులు. ఉల్లాసవంతమైన ఆటల్లేవు. స్నేహితుల ముచ్చట్లు లేవు. స్నేహంలేదు. సానుభూతి లేదు. ఉన్నదల్లా ఒంటరితనం, దుఃఖం. కురూపం. స్నేహాల్లేని బాల్యం. ఆటల్లేని జీవితం. బడికి దూరంగా, ఇంట్లో ఒంటరిగా ఉండే ఆమె తన శరీరాన్ని తానే అసహ్యించుకుని ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. ఇలాంటి సందర్భాల్లో మంగళకు ఆమె తండ్రి ధైర్యం నూరిపోసేవాడు. తన బిడ్డను ధీరగా తీర్చిదిద్దాడు. తండ్రి ప్రోత్సాహంతో ఉత్సాహం కూడగట్టుకునేది మంగళ. మంగళకు చదువు అంటే ఎంత ఇష్టమో. సంగీతం కూడా అంతే ప్రాణం. తన ముఖాన్ని, మెడ, ఛాతీ భాగాన్ని యాసిడ్ మాడ్చేసింది. కానీ, ఆమె గొంతుని గాయపరచలేకపోయింది. నేర్చుకోవాలనే తృష్ణ ఆమెను సంగీత సాధనకు పురిగొల్పింది. ఇంటిపట్టునే గాత్ర సంగీత సాధన మొదలుపెట్టింది. గ్వాలియర్ ఘరానా హిందుస్థానీ సంగీతం నేర్చుకుంది. మరోవైపు దూరవిద్యా విధానంలో చదువు మొదలుపెట్టింది. బెనారస్ హిందూ యూనివర్సిటీలో అడుగుపెట్టి, బ్యాచలర్ ఆఫ్ మ్యూజిక్‌లో చేరింది. తర్వాత మాస్టర్ ఆఫ్ మ్యూజిక్ కోర్సు చేసింది. ఈ రెండు కోర్సుల్లోనూ బంగారు పతకాలు సాధించి.. సంగీతంలో రాటుదేలింది. గాయాలు మానుతూ, కొత్త రూపులోకి వస్తున్న తరుణంలోనే ఆమె స్వరం కూడా ఉచ్ఛస్థితికి చేరుకుంది. బెనారస్ విశ్వవిద్యాలయం నుంచి సంగీత కళల్లో పీహెచ్‌డీ పూర్తి చేసి, డాక్టరేట్ డిగ్రీ అందుకుంది. ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తూ, బాధితులకు స్ఫూర్తినిస్తూ మంగళ ఓ రోజు వార్తల్లో నిలిచింది. తొలి యాసిడ్ బాధితురాలిగానే బయటి ప్రపంచానికి తెలిసిన మంగళ బెనారస్ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి ఎంపికైంది. వారణాసిలోని ప్రసిద్ధ మహిళా మహావిద్యాలయలో సంగీత కళల విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ జీవితం మొదలుపెట్టింది. నలుగురిలోకి వెళ్తే ప్రత్యేకంగా చూస్తారని, తనని దూరం పెడతారనే భయం, ఆలోచన లేకుండా పట్టుదలతో కొత్త ప్రయాణం మొదలుపెట్టింది. తరగతి గదిలో రాగ, తాళ గతులతో ఆమె గమనం మూడు దశాబ్దాలు విజయవంతంగా సాగిపోయింది. ఆమె గాన మాధుర్యంతో తాను తీసుకునే తరగతి గదులే కాదు మహిళా మహావిద్యాలయ ప్రాంగణమంతా ఓలలాడేది. అదే విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది, పదవీ విరమణ చేసింది. తరగతి గదుల్లోనే కాదు గాయపడ్డ హృదయ రాగాన్ని అనేక వేదికలపై మంగళ వినిపించింది. విద్యార్థులకు సంగీత పాఠాలు చెబుతూనే కచేరీల్లో హిందుస్థానీ రాగాలాపన చేసింది. మొదట్లో తన ముఖంపై ఉండే మచ్చలు, పోరాట జీవితం ఎంతోమందికి ఆసక్తి కలిగించింది. ఆ కారణంగానే కచేరీలకు వచ్చేవారు. తర్వాత ఆ మచ్చలు మరచిపోయి ఆమె గాత్రం నుంచి జాలువారే రాగాలలో లీనమైపోయేవారు. తర్వాత రోజుల్లో ఆ స్వరానికి అభిమానులయ్యారు. ఆమె కచేరీ ఎక్కడ ఉంటే అక్కడికి వచ్చేవారు. వారణాసిలో సంగీతానికి ఎంత ఆదరణ ఉండేదో, సంగీత ప్రియుల్లో మంగళకు అంతటి ఆదరణ ఉంది. తరంగ్ సంస్థ మంగళను 'కాశీ కీ లత' బిరుదుతో గౌరవించింది.

# 'రామాయణ'లో కాజల్ అగర్వాల్ పాత్రపై అందరిలో ఆసక్తి






టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన కాజల్ అగర్వాల్, వివాహం అనంతరం సినిమాల ఎంపికలో మార్పులు చేస్తూ, ఇప్పుడు మరింత ప్రతిష్టాత్మక ప్రాజెక్టలలో భాగమవుతున్నారు. ఇటీవల భగవంత్ కేసరి, కన్నప్ప వంటి చిత్రాల్లో నటించిన ఆమె, ఇప్పుడు భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న రామాయణ సినిమాలో భాగమవుతున్నట్లు ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్నారు. పురాణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో కనిపించనున్నారు. గత కొంతకాలంగా ఆమె రావణాసురుడి భార్య మండోదరి పాత్రలో నటిస్తున్నారని వస్తున్న వార్తలను తాజాగా ఆమె స్వయంగా ధృవీకరించారు. రీసెంట్‌గా సోషల్ మీడియా వేదికగా కాజల్ అగర్వాల్ 'రామాయణం' గ్లింప్స్‌ను షేర్ చేస్తూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "ప్రతి తరం శ్రీరాముడి పేరుతోనే పెరిగింది. ఇప్పుడు యావత్ ప్రపంచం మర్యాద పురుషోత్తముడైన ఆ రాముడిని దర్శించుకోనుంది. ఇలాంటి గొప్ప సినిమాలో భాగమవడం నాకు గర్వంగా ఉంది" అంటూ ఆమె రాసుకొచ్చారు. ఈ సినిమాలో స్టార్ క్యాస్టింగ్ కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు పెంచుతోంది. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. అలాగే సన్నీ డియోల్ హనుమంతుడి పాత్రలో, యష్ రావణాసురుడిగా కనిపించనున్నారు. ఈ భారీ చిత్రాన్ని నిర్మాత నమిత్ మల్హోత్రా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది. 'రామాయణం' చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొదటి భాగాన్ని ఈ ఏడాది దీపావళి సందర్భంగా విడుదల చేయనుండగా, రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఏది ఏమైన, కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో కనిపించనున్న వార్త అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచింది. ఆమె నటనపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం కాజల్ షేర్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ





'ధురంధర్ 2'ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించా లనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతో ంది. ఈ ప్రాజెక్ట్ హైవోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబో తోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నా రని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, సూర్యకు ఉన్ననటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచల నం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

# అభిమానుల్లో భారీ హైప్..!





పాన్‌ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా.. సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'స్పిరిట్' పై దేశవ్యాప్తంగా అంచనాలు ఆకాశాన్నంటుతు న్నాయి. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్', 'యానిమల్' లాంటి సెన్సేషనల్ సినిమాల తర్వాత సందీప్ రెడ్డి వంగా, ఇప్పుడు ప్రభాస్‌తో మాస్ ఎమోషనల్ పోలీస్ డ్రామా చేయబోతుండటంతో అభిమానుల్లో భారీ హైప్ నెలకొంది. భద్రకాళి పిక్చర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

ప్రీ-ప్రొడక్షన్ పనులు దాదాపు పూర్తి కాగా, షూటింగ్ త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాను 2026లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ గురువారం రాత్రి 11 గంటలకు 'ది సౌండ్ స్టోరీ ఆఫ్ ది ఫిల్మ్ స్పిరిట్' అనే 1 నిమిషం 31 సెకండ్ల గ్లింప్స్‌నువిడు దల చేశారు. ఈ వీడియోను తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ,మల యాళ భాషల్లో రిలీజ్ చేశారు. సౌండ్ థీమ్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేసిన సందీప్ వంగా మార్క్ స్టైల్ గ్లింప్స్‌లో బలంగా కనిపించింది. ఐపీఎస్ ఆఫీసర్‌గా ఉన్న ప్రభాస్‌అరెస్ట్ అయ్యే సన్నివేశాలను కేవలం ఆడియో రూపంలో చూపించడం ఆసక్తికరం గా మారింది. ఇందు లో ప్రకాశ్ రాజ్ వాయిస్‌తో.."వీడి గురించి విన్నాను యూనిఫాం ఉన్నా లేకపోయినా బిహేవియర్‌లో తేడా ఉండదు.. చూద్దాం ఈ ఖైదీ యూనిఫాంలో ఎలా ఉంటాడో!" అనేది వంగా రైటింగ్ శైలిని గుర్తు చేసింది. ఇక చివర్లో ప్రభాస్ చెప్పిన.. "మిస్టర్ సూపరింటెండెంట్.. నాకు చిన్నప్పటి నుంచి ఒక బ్యాడ్ హ్యాబిట్ ఉంది" అనే డైలాగ్ గ్లింప్స్ మొత్తానికే హైలైట్‌గా నిలి చింది. ఆ ఒక్క లైన్‌తోనే ఆయన పాత్ర ఇంటెన్స్‌గా, రఫ్‌గా ఉండబో తుందనేది స్పష్టమవుతోంది.

సినిమా సౌండ్ డిజైన్‌పై మాట్లాడిన సందీప్ వంగా, "సాధారణంగా సినిమాకు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌ను చివర్లో జత చేస్తారు. కానీ 'స్పిరిట్'లో మేము ముందే 70 శాతం సౌండ్‌ట్రాక్‌ను సిద్ధం చేశాం. ఆ సౌండ్ ఆధారంగా షాట్లుప్లాన్ చేస్తున్నాం," అని చెప్పారు. ఇది భారతీయ సినీ చరిత్రలో అరుదైన ప్రయోగమని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సినిమాలో ప్రభాస్‌తో పాటు వివేక్ ఒబెరాయ్,త్రిప్తి దిమ్రీ,ప్రకాశ్ రాజ్,కాంచన వంటి ప్రముఖనటులు కీలక పాత్రల్లో కనిపించను న్నారు.

# వరుస ఫ్లాప్స్ తర్వాత రామ్ కొత్త ప్రయోగం



టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్‌రామ్ పోతినేని వరుస పరాజయాలతో సతమతమవుతున్నప్పటికీ, మళ్లీ బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని గట్టి నిర్ణయంతో ముందుకెళ్తున్నారు. ఇటీవలభారీ అంచనాల మధ్య విడుదలైన 'డబుల్ ఇస్మార్ట్', 'ఆంధ్ర కింగ్' వంటి చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, తన తదుపరి సినిమాల విషయంలో రామ్ మరింత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటి వరకు చేసిన రొటీన్ మాస్ సినిమాలకు భిన్నంగా, కొత్తదనం ఉన్న కథలను ఎంపిక చేసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావాలని రామ్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ సెన్సేషనల్ ప్రాజె క్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ సినిమాను ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ వద్ద శిష్యరికం చేసిన ఓ అసిస్టెంట్ డైరెక్టర్ తెరకెక్కించబోతున్నాడని సమాచారం. లోకేష్ సినిమాలకు ప్రత్యేకమైన ఇంటెన్సిటీ, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే ఎలా ఉంటాయో తెలిసిందే. అదే స్టైల్‌లో ఈ సినిమా కూడా పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందనుందని టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రం ద్వారా రామ్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించేందుకు దర్శకుడు ప్రయత్నిస్తున్నాడని తెలుస్తోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు మరో పెద్ద ప్లస్ పాయింట్ మ్యూజిక్. ప్రస్తుతం సౌత్ ఇండియాలో టాప్ మ్యూజిక్ డైరెక్టర్‌గా దూసుకుపోతున్న అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారని సమాచారం. అనిరుధ్ అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సాంగ్స్ సినిమాకు ప్రత్యేక హైప్ తీసుకురావడం ఖాయం. రామ్ ఎనర్జీకి అనిరుధ్ మ్యూజిక్ జతకలిస్తే థియేటర్లలో మంచి స్పందన రావడం ఖాయం అని అభిమానులు భావిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ రామ్ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలవొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. త్వరలోనే ఈ క్రేజీ కాంబినేషన్‌పై అధికా రిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మొత్తానికి, వరుస ఫ్లాప్స్ తర్వాత రామ్ తీసుకుంటున్న ఈ కొత్త నిర్ణయం ఆయన కెరీర్‌కు ఎంతవరకు మలుపుతిప్పుతుందో చూడాలి. కొత్త దర్శకుడి విజన్, అనిరుధ్ సంగీతం కలిసి రామ్‌కు మళ్లీ సక్సెస్ అందిస్తాయా అన్నది ఆసక్తికరంగా మారింది.

# మళ్లీ సినిమాలు చేస్తా: ఇలియానా..

గోవా బ్యూటీ ఇలియానా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేవదాసు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి ఆ తర్వాత రాఖీ, పోకిరి, జల్సా వంటి సూపర్‌హిట్‌లను అందుకోవడమే కాకుండా స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది.

ఒకప్పుడు స్టార్ నటిగా రూల్ చేసిన ఈ భామ ప్రస్తుతం సినిమాలు మానేసి ఫ్యామిలీతో సమయం గడుపుతున్న విషయం తెలిసిందే. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్న ఇలియానా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా ఫ్యామిలీతోనే గడుపుతున్న ఈ భామ.. తాజాగా మళ్లీ సినిమాలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ ప్రస్తుతం తాను తన ఇద్దరు కొడుకుల సంరక్షణలో బిజీగా ఉన్నానని, అందుకే సినిమాలకు విరామం తీసుకున్నానని ఇలియానా చెప్పింది. అలాగే అభిమానులు నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో నాకు తెలుసు. నటన అంటే నాకెంతో ఇష్టం. తెరపై కనిపించడం, విభిన్నమైన పాత్రలు పోషించడం, సెట్‌లో ఉండే సందడి ఇవన్నీ నాకు చాలా ఇష్టం.నా కెరీర్‌లో ఎంతోమంది గొప్ప వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అని ఇలియానా అన్నారు. అయితే పిల్లల బాధ్యతకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని, అందుకే కొద్ది రోజులు ఆగి మళ్లీ వస్తానని ఆమె తెలిపారు.



Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1,
Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com